
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

శనివారం 4 మే 2024







ఆ ఓట్లకు.. ఎర

- ఉద్యోగులకు ప్రలోభాలు..
- ఓటుకు రూ.3 వేలు రేటు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో ఆ ఓటుకు అత్యధిక ప్రాధాన్యం ఉంది. ఉద్యోగ వర్గాల ఓటర్ల తీర్పుపైనే ప్రభుత్వాలు ఏర్పడు తుంటాయి. ముందుగా పోస్టల్ బ్యాలట్‌లనే లెక్కిస్తారు. వీటి ట్రెండ్ ఆధారంగా ఏ ప్రభుత్వం ఏర్పడుతుందో అసలు ఓట్ల లెక్కింపు కంటే ముందుగానే అర్థమవుతుంది. ప్రతి ఎన్నికల్లో ఉద్యోగులు ఇచ్చే తీర్పు ఆధారంగా ప్రభుత్వాలు ఏర్పడటం చూశాం. ఈ సారి కూడా ఉద్యోగ వర్గాల ఓటుకు అత్యధిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు వైసీపీ అభ్యర్థులు తెరలేపారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు 5, 6, 7 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్‌లను జారీ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 17,770 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయనున్నారు. ఇందు కోసం ఎన్నికల యంత్రాగం ఏర్పాట్లు చేసింది. పోస్టల్ బ్యాలెట్ ఓటును కవర్‌లో పెట్టి పోస్టులో గతంలో పంపేవారు. పేరు పోస్టల్ బ్యాలెట్ అయినా ఈ విధానంలో ఎన్నికల కమిషన్ మార్పు తీసుకొచ్చింది. ఉద్యోగుల కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసింది. నేరుగా వారి కేటాయించిన తేదీల్లో ఆయా కేంద్రాల్లో ఓట్లు వేయనున్నారు.

కొందరిని ఏజెంట్లుగా..

ఉద్యోగుల ఓట్లకు డబ్బుతో ఎరవేసేందుకు వైసీపీ అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకున్నారు. ఉద్యోగుల్లోనే కొందరిని ఏజెంట్లుగా నియమించుకొని ఓట్ల కొనుగోలును చేపట్టారు. ఈ ప్రక్రియను విస్తృతంగా అమలు చేస్తున్నారు. ఓటుకు రూ.3 వేలు రేటు నిర్ణయించారు. భారీగా ఓట్లు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఆర్వో కార్యాలయాల నుంచి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగుల వివరాలను సేకరించారు. వారి చిరునామాల ఆధారంగా వారి ఇళ్లకు వెళ్లి బేరసారాలు చేస్తున్నారు. దీంతో తెలుగుదేశం అభ్యర్థులు కూడా అప్రమత్తమయ్యారు. కొన్నిచోట్ల ఉద్యోగుల ఓట్లు కొనుగోలు చేసేందుకు టీడీపీ కూడా కసరత్తు చేస్తోంది.

ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత


ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ఇక్కట్లు పడ్డ ఉద్యోగులు వైసీపీ పట్ల కొంత ఆగ్రహంగా ఉన్నారు. ప్రధానంగా ఉపాధ్యాయ వర్గం నుంచి వైసీపీ అభ్యర్థులు తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతల ద్వారా ఉపాధ్యాయుల ఓట్లు కొనుగోలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నట్టు తెలిసింది. తమ ఓటును వైసీపీకి అమ్ముకోబోమని కొందరు ఉపాధ్యాయులు ముఖం మీదనే చెబు తున్నారు. ఉపాధ్యాయ వర్గం నుంచి వ్యతి రేకత వ్యక్తమవుతుండటంతో మిగతా ఉద్యోగుల మద్దతు పొందేందుకు వైసీపీ అభ్యర్థులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు నుంచి మూడు వేల పోస్టల్ బ్యాలెట్లు ఉన్నాయి. గత ఎన్నికల్లో ఉద్యోగులు వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా ఓటు వేసిన విషయం తెలిసిందే. ఆ పరిస్థితులు తారు మారు అవుతుండటంతో సదరు అభ్యర్థులు నష్టపోనున్నారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఉద్యోగులు కూటమి అభ్యర్థులకు మద్దతు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ఉపా ధ్యాయ వర్గం నుంచి వస్తున్న వ్యతిరేకతతో వైసీపీ అభ్య ర్థులు కంగుతింటున్నారు. అవసర మైతే ఓటు రేటు పెంచి ఉద్యోగుల పోస్టల్ ఓట్లు పొందేందుకు సదరు అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఉద్యోగులు వేసే ఓటుపై అభ్యర్థుల భవిష్యత్ ఆధారపడి ఉందని చెప్పవచ్చు.

కొత్తదారుల్లో.. కోట్లు!

- చెక్‌పోస్టులు దాటకుండానే సిద్ధం
- చాలా వరకు ముందే మేల్కొని సర్దేశారు
- అధికార పార్టీకి ఇసుక డబ్బూ కల్పతరువే
- వైసీపీ అభ్యర్థులకు సూక్ష్మ రుణ సంస్థల సహకారం

ఎన్నికలంటే ప్రచారం.. పోలింగ్‌కే పరిమితం కావడంలేదు. ఓట్ల పండుగ.. రూ.కోట్లు ఖర్చయ్యే కార్యక్రమంగా మారింది. డబ్బు కట్టలు తెగాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం డబ్బు తరలింపును కట్టడి చేసేందుకు చేస్తోన్న యత్నాలు రాజకీయ నాయకుల జిమ్మిక్కులతో ఎక్కడికక్కడ విఫలమవుతున్నాయి. ప్రచార ఖర్చులు ఒకెత్తు అయితే పోలింగ్‌కు ముందు ఓటర్లకు డబ్బు పంపిణీ ఓ పెద్ద ప్రహస నం. ఈ క్రమంలో గతానుభవాలను దృష్టి లో ఉంచు కున్న అభ్యర్థులు రూ.కోట్లు తరలిం చేందుకు, సమీకరించేందుకు కొత్తదారు లతో సిద్ధమయ్యారు. అధికార పార్టీ అభ్యర్థులు ఇప్పటికే డబ్బు విషయంలో సిద్ధమ య్యారని సమాచారం. డబ్బుకు లోటులేకుండా సమకూర్చుకుని జాగ్రత్త పడ్డారని తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థులకు ఇసుక డబ్బు కల్పతరువుగా మారింది. పైగా ఎక్కడికక్కడ గ్రామాల్లో పాతుకుపోయిన సూక్ష్మ రుణ సంస్థల సహకారం కూడా వారికి ఉంది. ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా పెద్దమొత్తంలో నగదు పట్టుబడలేదంటే అభ్యర్థులు ఏ స్థాయిలో జాగ్రత్తగా ఉన్నారో తెలుస్తోంది.

తెనాలి, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకోసం అవసరమైన డబ్బు సమకూర్చుకోవడానికి కొత్తదారులు వెతుకుతున్నారు. అధికార వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేలే పోటీలో ఉండగా వారు వెతుక్కోవాల్సిన పనిలేకుండా ముందుగానే అంతా సిద్ధం చేసుకున్నారనేది సమాచారం. ఎన్నికలకు అవసరమైన డబ్బు సంపాదించుకునే అవకాశం కల్పిస్తే, ఒక ఎన్నిక కోసం కాకుండా ఏకంగా పది ఎన్నికలకు సరిపడా డబ్బు వెనకేశారనేది పలుమార్లు ప్రతిపక్ష పార్టీలు చేస్తూ వచ్చిన ఆరోపణే. ఈ రోజుల్లో ఎన్నికలంటే డబ్బు. అభ్యర్థుల ప్రచారానికి జన సమీకరణ నుంచి, ఓటు కోసం ఎర వేసేవరకు అంతా డబ్బుతోనే ముడిపడిఉంది. పోలింగ్ నాటికి డబ్బు కట్టలు తెంచుకోవడానికి సిద్ధమవుతోంది. ఒక్కో అసెంబ్లీ అభ్యర్థి రూ.30 కోట్ల నుంచి, రూ.50 కోట్ల వరకు ఖర్చు చెయ్యాలనే లక్ష్యంతో ఉన్నారనేది బహిరంగ రహస్యమే. అటు ఎంపీ అభ్యర్థులూ వారి ఖర్చులు కాక, తన నియోజకవర్గ పరిధిలో ఉన్న అసెంబ్లీ అభ్యర్థులకూ రూ.10 నుంచి రూ.20 కోట్ల వరకు డబ్బు సర్దుబాటు చెయ్యాల్సి రావడంతో ఒక్కో అభ్యర్థికి రూ.50 నుంచి రూ.80 కోట్ల వరకు ఖర్చు తప్పని పరిస్థితి. కొందరికైతే రూ.100 కోట్లు దాటిపోతున్న పరిస్థితుల్లో ఖర్చంటే లెక్కచేయని వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ముందస్తుగా అధికార పార్టీ అభ్యర్థులు డబ్బు సమకూర్చుకోలేని పరిస్థితుల్లో సూక్ష్మ రుణ సంస్థల నుంచి డబ్బు సమకూర్చుకుంటున్నారని సమాచారం. ప్రతి గ్రామంలోనూ ఈ సంస్థలు వేళ్లూనుకుపోయాయి. వారాలు, రోజువారీ వసూళ్ల వంటి సంస్థలు జనానికి సుపరిచితమే. అయితే వీరి దగ్గర భారీ మొత్తంలో ఎప్పుడూ డబ్బు నిల్వ ఉంటుంది కనుక ఈ నెల రోజులు ఎన్నికలకు అడ్డం వేసేందుకు ఇప్పటికే అంగీకరించారని తెలిసింది. ఇక గ్రామాల్లో ఎవరైనా అప్పు కావాలన్నా పెద్ద మొత్తాలు అప్పుగా ఇవ్వకుండా, చాలావరకు లేవని చెప్పేస్తున్నారు. ఎందుకని ఆరాతీస్తే డబ్బు పలానా అభ్యర్థికి సర్దాల్సి వచ్చినందువల్ల ఇవ్వలేకపోతున్నామని బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. ఇవికాక అధికార పార్టీకి చెందిన కొన్ని సంస్థలు, కంపెనీలు, పెద్ద కాంట్రాక్టర్ల నుంచి కూడా డబ్బు అందుతోందని సమాచారం.



ముందుగా మేల్కొన్న అభ్యర్థులు

గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల సందర్భంగా ఏ చెక్‌పోస్టులోనూ ఒక రాజకీయ నాయకుడివనో, పలానా అభ్యర్థికి సంబంధించిన డబ్బని భారీ మొత్తంలో నగదు దొరికిన సందర్భాలు తక్కువే. దీని నిబట్టి చూస్తే ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ముందుగానే మేల్కొన్నారనేది అర్థమవుతోంది. దీనికితోడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది ముందుగానే ఒక నిర్ధారణకు వచ్చారు. అధికార వైసీపీ అయితే ఎన్నికల కోడ్ రాకముందే తమ అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ, వారు ఎమ్మెల్యేగా గెలిస్తే లభించే అధికార లాంఛనాలన్నిటినీ కల్పించేసింది. ఇటు ప్రతిపక్షంలో ఉన్న కూటమి అభ్యర్థులు ఎవరనేది



కూడా ఈసారి ముందుగానే తేలిపోవడంతో ఎవరికివారు డబ్బు సమకూర్చుకునే విషయంలో జాగ్రత్త పడ్డారు. అయితే కొన్ని స్థానాల్లో మాత్రమే చివరి నిమిషంలో మార్పులు జరిగినా, వాటిలోనూ డబ్బు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తపడ్డట్టున్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో పట్టుబడిన నగదు కేవలం రూ.50 వేల నుంచి రూ.లక్ష, రెండు లక్షల వరకు ఉండటం దీనికి నిదర్శనం. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో భారీ మొత్తాలు దొరికింది అంతంతమాత్రమే. గత ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులకు ఏ ఆటంకం లేకుండా డబ్బు అందుబాటు కావడం, అనేక మార్గాల్లో తేలికగా చేరవేశారనే విమర్శలు వచ్చాయి. ఈసారి అధికార వైసీపీనే కాకుండా, ప్రతిపక్ష కూటమి అభ్యర్థులు కూడా గత అనుభవాలతో ముందుగానే జాగ్రత్తపడ్డట్లున్నారు. పోలింగ్‌కు కేవలం తొమ్మిది రోజులే గడువు ఉంటే, చివరి ఐదు రోజుల్లో ఓటుకు డబ్బు పంపిణీ ఊపందుకునే అవకాశం ఉంది. అయితే ఎవరూ హడావిడి పడటం, తొందరపడి దూర ప్రాంతాల నుంచి డబ్బు తరలిస్తున్న పరిస్థితులు కనిపించడంలేదు.



తెనాలి వద్ద తనిఖీలులో చేస్తున్న పోలీసులు (పాత చిత్రం)

ఇసుక మాటున కట్టలు

గతంలో పార్సిల్ లారీలు, అంబులెన్స్‌లను డబ్బు తరలింపునకు ఉపయోగించారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు ఇసుక లారీలను వాడుకుంటున్నారని తెలిసింది. ఈ లారీలకు బిల్లు ఉన్నా, లేకున్నా ఎక్కడా పోలీసులు ఆపకపోవటం, తనిఖీ కూడా నామమాత్రంగా చేస్తుండటంతో వారికి అడ్డులేకుండా పోతోంది. వీటిలో డబ్బు తరలిపోతున్నా పట్టించుకోవడంలేదని ఇటీవల జనసేన నేతల ఆరోపించారు. అయినా పోలీసులు అంతంతమాత్రంగానే చూసి వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన మొత్తాలను కూడా ఏరోజుకారోజు కొన్ని చోట్ల నేతలు ఆదేశించిన వారికి అందిస్తున్నారని చెబుతున్నారు. ఒక్కో రీచ్‌లో ఒక్క రోజులో జరుగుతున్న వ్యాపారమే అధికారికంగా రూ.20 లక్షలు అనధికారికంగా రూ.కోటిపైనే ఉంటుం డటంతో ఈ డబ్బూ అభ్యర్థులకు ఇప్పుడు కల్పతరువుగా ఉపయోగపడుతోంది.

చెక్‌పోస్టు.. లేదు

జిల్లా, నియోజకవర్గ సరిహద్దులో పెద్దఎత్తున చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. నగదు, మద్యం, ఇతర తాయిలాలు తరలిపోకుండా పక్కాగా తనిఖీలు చేస్తున్నాం.. అని అటు ఎన్నికల అధికారులు, ఇటు పోలీసులు రోజూ ప్రకటిస్తున్నారు. సంచార బృందాలను కూడా సిద్ధం చేశామని అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నామని అధికారులు చెప్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయలేదు. ఏర్పాటు చేసిన దగ్గర కూడా అంతంతమాత్రంగానే తనిఖీలు చేస్తున్నారని, పెద్దగా డబ్బులు పట్టుపడకపోవడమే ఇందుకు కారణమన్న ఆరోపణలున్నాయి. గతంలో ప్రతి ఎన్నికల సమయంలో తెనాలి-చిలుమూరు రోడ్డులో తెనాలి బయట తప్పనిసరిగా ఒక చెక్‌పోస్ట్ ఉండేది. కానీ ఈ మార్గంలో ఈ సారి ఒక్క చెక్ పోస్టు పెట్టలేదు. పోలీసులకు బుద్ధిపుట్టినప్పుడు సంచార బృందాలతో మాటువేస్తున్నారే కానీ, కచ్చితమైన తనిఖీలు లేవు. అటు కృష్ణా కుడి కరకట్టపైనా, నది దాటే గాలు మార్గాలు, అంతర్గత రోడ్లపై నిఘానే లేదు. పొరపాటున ఎవరైనా పలానా వాహనంలో డబ్బు రవాణా అవుతుందని సమాచారం ఇస్తే తప్ప పోలీసులకు దొరుకుతున్న పరిస్థితిలేదు. దీనిని బట్టి చూస్తే అధికార పార్టీ నేతల హవా నిఘాపైనా ఎంతవరకు పని చేస్తుందనేది అర్థమవుతుంది. వీటన్నిటీ చూస్తుంటే ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల్లో నిజం ఉందనే అనుమానాలు కలగక మానవు.

అండగా ఉంటా

- ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా నిలుస్తా
- అరాచక పాలనకు ముగింపు పలుకుతాం
- ఆంధ్రజ్యోతితో పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్



పొన్నూరుటౌన్, మే 3: ప్రజలకు అండగా ఉంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా నిలుస్తా. ప్రజలు కల్పిస్తున్న భరోసాతో రానున్న ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన విజయాన్ని అందుకోబోతున్నాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో పొన్నూరులో జరిగిన దోపిడీ, అరాచకం, విధ్వంసం, దౌర్జన్యాలకు కూటమి విజయంతో ముగింపు ఇస్తాం.. అని పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగింపుగా పొన్నూరు బరిలో వరసుగా ఐదు పర్యాయాలు నరేంద్రకుమార్ విజయాలను సొంతం చేసుకున్నారు. ఆరో సారి ఓటమి చెందగా ఏడో సారి తిరిగి బరిలో నిలిచిన ఆయన ఆంధ్రజ్యోతితో వివిధ అంశాలపై మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజలు ప్రస్తావిస్తున్న సమస్యలు

ప్రచారంలో ఏ వార్డు, ఏ గ్రామాన్ని సందర్శించిన తాగునీటి ఇబ్బందులు గురించి ప్రజలు అత్యధికంగా ఫిర్యాదు చెశారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, గంజాయి బారిన పడిన యువత వేధింపులు, మందుబాబుల ఆగడాలు, శాంతి భద్రతల సమస్యల గురించి ఎక్కువ మంది ప్రస్తావిస్తున్నారు. పొలాలకు సాగు నీరు అందడం లేదని, పంట ఉత్పత్తులు అమ్ముకోలేక పడుతున్న ఇబ్బందులు, ఆర్‌బీకేల్లో దోపిడీలపై రైతులు ఎక్కువగా ప్రస్తావిస్తున్నారు.

అభివృద్ధిని పట్టించుకోలేదు

భూటకపు సంక్షేమం మాటున వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేసింది. ఐదేళ్లలో గ్రామాల ప్రగతిని విస్మరించింది. గ్రామాల్లో ఒక్క రహదారి నిర్మాణం కూడా చేపట్టలేదు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో 142 కిలోమీటర్ల మేర రూ.403 కోట్లతో రహదారుల నిర్మాణం చెప్పట్టాం. ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో రూ.70 కోట్లతో 125 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారులను నిర్మించాం.

ఎదురేగి స్వాగతం

ఎన్నికల ప్రచారంలో ప్రజలు ప్రతీ దగ్గర ఎదురేగి స్వాగతం పలికి అండగా నిలుస్తూ ఆశీర్వదిస్తున్నారు. మా పక్షాన ప్రజలే మేనిఫెస్టో గురించి తోటి వారికి వివరిస్తున్నారు.

మేనిఫెస్టోపై ప్రజా స్పందన

టీడీపీ సూపర్ - 6, కూటమి మేనిఫెస్టోపై ప్రజల్లో స్పందన వస్తోంది. పెన్షన్ల పెంపు ఆకర్షిస్తుంది. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందిస్తామని ఇచ్చిన హామీపై మహిళల్లో హర్షం వ్యక్తం అవుతుంది. ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, ప్రత్యేక రక్షణ చట్టాలు, మైనార్టీల సంక్షేమ పథకాలపై సానుకూలత పెరుగుతోంది.

సమస్యలపై హామీలు

ప్రజలు తెలియజేస్తున్న ప్రతీ సమస్యను గుర్తించి నివేదిక రూపొందించుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ సమస్యలను పరిష్కరిస్తాం. తాగునీరు అందించేందుకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం. వైసీపీ ప్రభుత్వం తొలగించిన 7 వేల పెన్షన్ల పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటాం. వైసీపీ ప్రభుత్వం వదిలేసిన అభివృద్ధిని కూటమి ప్రభుత్వంలో తిరిగి కొనసాగిస్తాం.

ప్రచారం.. ప్రజా స్పందన

- నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించి ప్రతి ఇంటి తలుపు తట్టడమే కాకుండా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలిసి వారి కష్ట సుఖాలను తెలుసుకున్నాను. వెంట నడుస్తూ కూటమికి అండగా నిలుస్తున్నారు. ప్రజల ఆశీస్సులే శ్రీరామరక్ష.

మొక్కవోని ధైర్యం

గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. అయినా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టనష్టాల్లో భాగస్వాములయ్యారు. ప్రభుత్వం నుంచి 16 కేసులు ఎదుర్కొని 30 రోజుల పాటు జైలు జీవితం గడపారు. ప్రతికూల పరిస్థితులు ఎన్నింటినో ఎదుర్కొన్నారు. అయినా మొక్కవోని ధైర్యంతో పొన్నూరులో టీడీపీ జెండా ఎగురవేసేందుకు ఏడో సారి బరిలో నిలిచారు.

పెన్షన్లపై ఆవేదనలు

ఎన్నికల ప్రచారం ప్రారంభించిన నాటి నుంచి వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తమ వద్దకు వచ్చి పెన్షన్ల తొలగింపుపై ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, ఇళ్ల స్థలాల ఆంక్షలతో పెన్షన్లు తొలగించారని వాపోయారు. ఐదేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న పలు సమస్యలను తెలియజేశారు.

వేధింపులపై కన్నీళ్లు..

వైసీపీ పాలకులు ప్రజల్లో భయాన్ని సృష్టించి వేధింపులకు గురి చేశారు. వారి వేధింపులపై బాధితులు కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలున్నాయి. ఎన్నికల ప్రచారంలో ప్రజలు వ్యక్తిగతంగా కలిసి తమకు ఎదురైన దారుణ సంఘటనల గురించి చెప్పుకుని ఎంతోమంది ఆవేదన వ్యక్తం చేశారు. జీబీసీ రోడ్డు విస్తరణ బాధితులకు ఇంతవరకు పరిహారం, టీడీఆర్ బాండ్లు కానీ అందించలేదు. బాధితులు సర్వం కోల్పోయి దిక్కుతోచనిస్థితిలో కన్నీటి పర్యంతమవుతున్నారు. వారికి సమాధానం చెప్పే ధైర్యం నేటి పాలకులకు లేదు.

5న నీట్ పరీక్ష

● గుంటూరు నగరంలో ఏడు, పొన్నూరులో ఒక కేంద్రం

గుంటూరు(విద్య), మే3: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయిలో జరిగే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ఈనెల 5న జిల్లాలో నిర్వహించనున్నారు. ఇందుకోసం గుంటూరు నగరంలో ఏడు కేంద్రాలు, పొన్నూరులో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.20 వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను కేంద్రాల్లో మధ్యాహ్నం 1.30 వరకే విద్యార్థులకు అనుమతిస్తారు పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 4,089 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఎన్‌టీఏ ప్రతినిధులు వెల్లడించారు. గుంటూరు నగరంలోని జేకేసీ కళాశాల, చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల, జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీస్కూల్, మోతడకలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాల, విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్, బ్రాడీపేటలోని బీహెచ్ డిగ్రీ కళాశాల, శ్యామలానగర్‌లోని శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, పొన్నూరులోని నాట్కో స్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఎన్‌టీఏ ఏర్పాటు చేసింది.

జంపని పొలిమేరలో

గొడుగు పాలుని శాసనస్తంభం

● జంపని గ్రామ చరిత్రగా గుర్తింపు



సదాశివరాయల నాటి వలయ వామన స్తంభ శాసనం, జంపని గొడుగు పాలుని శాసనం

వేమూరు, మే 3: గత ఆరేళ్ళ నాడు బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపని గ్రామ శివారులో డొంక రోడ్డు నిర్మాణం జరుగుతున్న సందర్భంలో తవ్వకాల్లో బయటపడ్డ శాసనపు స్తంభాలను ఆంధ్రజ్యోతి గుర్తించింది. సమాచారాన్ని వార్త రూపంలో ప్రకటించడంతో పాటు శాసన చరిత్రలను అన్వేషించే వ్యక్తులకు తెలిపింది. శాసన స్తంభాలను సమీపంలో ఆంజనేయస్వామి మందిరం వద్ద నిలబెట్టించింది. ఇటీవల ఈ ప్రాంత పర్యటనకు విచ్చేసిన శాసన చరిత్ర అన్వేషకుడు నల్లగొర్ల వేదాద్రి, వాటి ఫోటోలను ప్రముఖ చరిత్రకారుడు స్థపతి ఈమని శివనాగిరెడ్డికి పంపారు. శివనాగిరెడ్డి శాసనపఠాన్ని చారిత్రక విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి శుక్రవారం అందులోని చారిత్రక విషయాలను ప్రకటించారు. ఈ శాసన స్తంభంలో జంపని గొడుగుపాలుని శాసనంగా రాసి ఉందని, అందులో జంపని గ్రామ చరిత్ర ఉన్నట్లుగా పేర్కొన్నారు. శాసన వివరాలను సేకరించడంలో కృషి చేసిన చౌడం పురుషోత్తం, మణిమేల శివశంకర్, రామోజు హరగోపాల్‌లకు ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

నేడు రేపల్లెకు పవన్‌కల్యాణ్..

రేపల్లె / పొన్నూరు టౌన్, మే 3: రేపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో శనివారం జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉప్పూడిరోడ్డులోని హెలిప్యాడ్ వద్ద దిగి ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరకుని సభలో ప్రసంగించనున్నారని తెలిపారు.

5న పొన్నూరుకు.. ఈ నెల 5న పొన్నూరులో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నజ్జా ఫంక్షన్ హాల్ వద్ద హెలిప్యాడ్‌ను, పట్టణ ప్రధాన కూడలిలో ఎన్టీ రంగా విగ్రహం వద్ద నిర్వహించే సభా ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.



● భానుడు.. భగభగ
● 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత
● నరసరావుపేటలో అత్యధికంగా 46 డిగ్రీలు
● గుంటూరులో 44 డిగ్రీలను తాకిన ఉష్ణోగ్రత
● రాబోయే 48 గంటల్లో వడగాడ్పులు వీచే అవకాశం

భానుడు భగభగలాడాడు. మే నెల ఆరంభంలోనే విశ్వరూపం ప్రదర్శించడంతో ప్రజలు కారెత్తి పోతున్నారు. ఉమ్మడి గుంటూరుజిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం క్రితంవరకు 40 డిగ్రీల సెల్సియస్ మధ్యనే నమోదు అవుతూ వస్తోన్న ఉష్ణోగ్రత ఒక్కసారిగా 44 డిగ్రీలకు చేరింది. గుంటూరు జిల్లాలోనూ ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో పలు మండలాల్లో 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ డేటాలో అత్యధికంగా నరసరావుపేటలో 46 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్లు వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది.

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఎండలు ముదిరాయి. మేనెల వస్తూనే ఉచ్ఛస్థితికి చేరువ య్యాయి. మరికొద్ది రోజుల్లో రోహిణీ కార్తె ప్రారంభం కానుండగా ఇప్పుడే ఎండలు ఈస్థాయిలో మండుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే వాతావరణం వేడెక్కడం ప్రారంభించి గంటగంటకు నిప్పుల కొలిమిలా మారిపోయింది. ఇక మధ్యాహ్నం 12 గంటల నుంచి 3.30 గంటల మధ్యన ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టలేని పరిస్థితి తలెత్తింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోగా కనిష్ఠ ఉష్ణోగ్రత 30డిగ్రీల స్థాయిలో నమోదైంది. ఎయిర్‌కండీషనర్లు కూడా గదిలో ఉష్ణోగ్రతని పెద్దగా తగ్గించలేకపోతున్నాయంటే ఎండ తీవ్రత ఏస్థాయిలో ఉందో అంచనా వేయొచ్చు. మండే ఎండలకు మూగజీవాలు విలవిలలాడిపోయాయి. ఎండతాపం నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రత (డిగ్రీలలో)	
నరసరావుపేట	46
నూజెండ్ల	45.7
వెల్దుర్తి, మాచర్ల	45.2
రొంపిచర్ల	44.7
నకరికల్లు	44.3
గుంటూరు	44
అద్దంకి	40
సంతమాగులూరు	40
యద్దనపూడి	40

వాతావరణశాఖ హెచ్చరికలు..

ప్రభుత్వం విడుదల చేసిన రాబోయే 48 గంటల వాతావరణ అంచన మేరకు అమరావతి, పెదకూరపాడుతోపాటు పల్నాడులోని పలుమండలాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. మంగళగిరి, మేడికొండూరు, ఫిరంగిపురం, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, తాడేపల్లి, తాడికొండ, తెనాలి, తుళ్లూరులో ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. అద్దంకి, అమర్తలూరు, బల్లికురవ, భట్టిప్రోలు, చెరుకుపల్లి, ఇంకొల్లు, కారంచేడు, కొల్లూరు, కొరిశపాడు, మార్టూరు, పర్చూరు, సంతమాగులూరు, చుండూరు, వేమూరు, యద్దనపూడిలో 44 డిగ్రీలకు చేరుకోవచ్చని అంచనా వేశారు.

బయటకు రావొద్దు.. జాగ్రత్త

ఎండల తీవ్రత, వడగాడ్పుల దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇళ్లల్లోనే ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఎండ దెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలన్నారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు చెవుల్లోకి వేడిగాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. గుండెజబ్బులు, షుగర్, బీపీ ఉన్న వారు ఎండలో తిరగకూడదని స్పష్టం చేశారు. శారీరక శ్రమతో కూడిన కఠినమైన పనులను ఎండలో చేయ రాదని విపత్తుల సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

ప్రజల సంతోషమే టీడీపీ అజెండా

● లావు శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఎంపీ లావు పక్కన డాక్టర్ అరవిందబాబు తదితరులు


నరసరావుపేటటౌన్, మే3: ప్రజలందరూ సంతోషంగా జీవించటమే టీడీపీ అజెండా అని, మా దృష్టి అంతా ప్రజల అభివృద్ధి, సంక్షేమంపైనే నని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలోని 30, 31. 32. 33. 34 వార్డులలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పెట్టేవిధంగా మా పాలన ఉండదని, నరసరావుపేట పట్టణ రూపురేఖలు మారుస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాలలో వెలుగురేఖలు నింపుతామని, ఎన్నికల సమీపంలో ఉన్నందున ప్రతి ఒక్కరు సైన్యంలా పనిచేయాలన్నారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్ళే బాధ్యతను డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని అందరం కలిసి తీసుకుంటామని వెల్లడించారు. ప్రతీ గ్రామంలో, వార్డులలో సైడ్ కాలువలు, డ్రెయినేజ్ వ్యవస్థ, తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నామన్నారు. ఉమ్మడి కూటమి తీసుకురాబోతున్న సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అన్నానరు. ముస్లింలు ఏ ఆపోహలు పెట్టుకోవద్దని, ఎన్ఆర్‌సీ, 4శాతం రిజర్వేషన్ మీద కూటమి అండగా నిలబడుతుందన్నారు. నరసరావుపేట గడ్డమీద తెలుగుదేశం జెండా ఎగిరేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్రకార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కత్తి చలమరాజు తదితరులతో యరపతినేని

టీడీపీలోకి వైసీపీ లీగల్ సెల్ కన్వీనర్..

గురజాలటౌన్, మే 3: గురజాలలో వైసీపీకి మరో షాక్ తగిలింది. శుక్రవారం పిడుగురాళ్లలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీ లీగల్ సెల్ కన్వీనర్ కత్తి చలమరాజు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. చలమరాజు ఆధ్వర్యాన 19వ వార్డు కౌన్సిలర్ కత్తి రామాదేవి రవి బాబు, కుక్కమూడి ఏసురత్నం, కత్తి దానం, అట్లూరి చిన్ని ఆదూరి ప్రవీణ్, పులిగుజ్జు రవికిరణ్, బంక కోటేశ్వరరావులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి యరపతినేని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కత్తి ప్రసంగి, మాజీ ఎంపీటీసీ శరమాళ్ల హనుమంతురావు, కుక్కమూడి కల్యాణ్, కోటి తదితరులు పాల్గొన్నారు.



సంఘు నేతలతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న మనోహర్

మాదిగలకు ద్రోహం చేసిన వైసీపీ

● మాదిగల కుల సంఘ జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాదిగ

తెనాలి రూరల్, మే 3: మాదిగలను అన్ని విధాలుగా వంచనచేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలో గద్దెదించి ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని మాదిగ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు ప్రకటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాల పేరు మీద దారి మళ్లించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీలు కలలు కంటున్న వర్గీకరణ బిల్లు సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి దళితుల అభ్యున్నతిని కుంటుపరిచి, దళితులపై దాడులకు పాల్పడుతూ వారి శవాలను డోర్ డెలివరీ చేసిన హంతకులకు అండగా నిలిచి దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగ బంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కఠెవరపు కోటేశ్వరరావు మాదిగ, డీవీఎఫ్ తెనాలి మండల అధ్యక్షుడు సుద్ధపల్లి శశికిరణ్ తదితరనాయకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ హత్యకేసులో

ముగ్గురికి జీవిత ఖైదు

రెంటచింతల, మే 3 : మండలంలోని పశర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ చింతమళ్ల పెద వెంకటేశ్వర్లు హత్య కేసులో ముగ్గురు వ్యక్తులకు జీవిత ఖైదు విధిస్తూ గుంటూరు 5వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.నీలిమ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి తెలిపారు. ఈ ఘటన 2015 సెప్టెంబరు 18న వినాయక నిమజ్జనం అనంతరం జరిగిన ఘర్షణలో ఈ హత్య చోటు చేసుకుంది. మొదటి నిందితుడు దాసి మల్లికార్జునరావుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.15 వేలు జరిమానా, 2, 3వ నిందితులైన దొడ్డా బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా, 6వ, 8వ ముద్దాయిలైన దాసి బాలసైదులు, సాయి కుమార్‌లకు 4 సంవత్సరాల శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. మిగిలిన 9 మందిపై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా 5వ ఏడీజె కోర్టుకు చెందిన పల్లపు కృష్ణ వ్యవహరించగా అప్పటి గురజాల రూరల్ సీఐ అలహరి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మద్యం కేసులో వైసీపీ నేత అరెస్టు

నరసరావుపేట లీగల్, మే 3: అక్రమంగా మద్యం తరలిస్తున్న పట్టణానికి చెందిన 8వ వార్డు మాజీ కౌన్సిలర్, వైసీపీ నేత షేక్ సత్తార్‌ను నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మద్యంతో పాటు ఓ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నామని సీఐ బి.నయన తార తెలిపారు. ఈ కేసుకు సంబందించి నాగశేషు అనే మరో వ్యక్తిని కూడా అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.



గ్రామానికి చేరిన ఆత్మకూరు టీడీపీ నేతలు, కార్యకర్తలు

సొంతూరుకు ఆత్మకూరు టీడీపీ నేతలు

దుర్గి, మే 3: మండలంలోని ఆత్మకూరుకు చెందిన టీడీపీ నేతలు 2019 ఎన్నికల అనంతరం గ్రామం వదిలి వెళ్లిపోయారు. వైసీపీ దాడులు, పోలీసుల వేధింపులు తాళలేక గ్రామం వదిలి టీడీపీకి చెందిన 90 కుటుంబాలు వేరే గ్రామాల్లో నివసిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని పోలీసులు చర్చలు జరిపి అండగా ఉంటామని హామీనిచ్చి శుక్రవారం సొంత గ్రామానికి తీసుకొచ్చారు. వైసీపీ, టీడీపీ నేతలను పిలిపించి సంధి కుదిర్చారు. సీఐ చినమల్లయ్య మాట్లాడుతూ అన్నదమ్ముల్లా అందరూ కలిసిమెలిసి ఉండాలని, రాజకీయ నేతల మాటలు నమ్మి కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని అన్నారు. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీఆర్పీఎఫ్ బలగాలు పహారా కాస్తాయని, స్వేచ్ఛగా ఓటు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కోటయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

మూడు ముక్కలాటతో అమరావతి నిర్వీర్యం

● 1599వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే3: జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్వీర్యం అయ్యిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పెట్టి రాష్ట్ర ప్రజల ఆస్తులకు టెండర్ పెట్టాడని, వైసీపీకి ఓటు వేస్తే మీ ఆస్తులు మీ చేతిల్లో ఉండవని రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1599వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారన్నారు. అన్నీ వ్యవస్థలు వైసీపీ ప్రభుత్వంలో నిస్తేజం అయ్యాయన్నారు. మూడు రాజధానులని రాష్ట్రం ఏ విధంగా అధోగతి పాలైందో ఓటర్లు గమనించాలన్నారు. విజనరి ఉన్న నాయకుడు సీఎం కావాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు రాజధాని 29 గ్రామాల్లో రైతుల ఆందోళన కొనసాగింది.



వంగవీటి రాధాను సన్మానిస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి, దేగల ప్రభాకర్

బటన్ నొక్కి అలసిన జగన్‌ను ఇంటికి పంపిద్దాం

● కాపు సామాజిక వర్గానికి వంగవీటి రాధా పిలుపు
● పవన్‌లాగే నేను కూడా ప్రజలకోసం వచ్చా: పెమ్మసాని

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): 'బటన్ నొక్కినొక్కి జగన్ అలిసిపోయాడు.. ఈనెల 13న మనం బటన్ నొక్కి ఆయనను ఇంటికి పంపుదాం' అంటూ టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధా పిలుపునిచ్చారు. గుంటూరు వివాహ కన్వెన్షన్ సెంటర్లో ఎన్డీఏ కూటమి కాపు నేతల సమావేశం శుక్రవారం జరిగింది. ఈసమావేశంలో వంగవీటి రాధాకృష్ణ, గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి, నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో వంగవీటి రాధా మాట్లాడుతూ మన ప్రాంతాన్ని మనం కాపాడుకోవటం మన చేతుల్లో ఉంది. అందుకోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు. కులాన్ని స్వార్థం కోసం వాడుకుని పదవులు పొందితే అవి కొంతకాలమే వుంటాయని, వంగవీటి రంగా ప్రజలకోసం నిలబడడంవల్లే ప్రజల గుండెల్లో నిలిచిపోయా రన్నారు. ఓట్లు చీలకూడదన్న తన మాటకు కట్టుబడి పవన్ తక్కువ సీట్లు తీసుకున్నారన్నారు. జగన్‌రెడ్డి 'సిద్ధం' అంటే జనసైనికులు'సై' అంటున్నార న్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యత అందరం తీసుకుందామ న్నారు. గుంటూరు సమస్యలను గల్లా జయదేవ్ పార్లమెంటులో వినిపించారు. ఇప్పుడు పెమ్మసాని చంద్రశేఖర్ ముందుకువచ్చారు. ఆగిపో యిన అమరావతి నిర్మాణం ముందుకు సాగాలంటే పెమ్మసాని గెలవాలి. గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న పిడుగురాళ్ల మాధవిని గెలిపించాలి అని ఆయన చెప్పారు. ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తున్న విశ్రాంత ఐఏఎస్ బూర్ల రామాంజనేయులును అత్యధిగ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసర ముందని అన్నారు. అమరావతే రాజధానిగా ఉండాలన్న నినాదాన్ని ప్రపంచ మంతా చాటాలని చెప్పారు. 'చేయి చేయి కలుపు.. చేజారదు గెలుపు అన్న వంగవీటి రంగా మాటలు గుర్తు చేస్తూ.. కూటమి గెలుపుకు అందరూ ఐక్యంగా నిలవాలని కోరారు. మీరు చూపించే అభిమానం ఈనెల 13న ఓటురూపంలో ఉండాలని అన్నారు.



కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ భావజాలం తనకు బాగా నచ్చిందని, తనకెంతో ఇష్టమని అన్నారు. 'ఆయన ప్రజల కోసం వచ్చారు. నేను కూడా అందుకే వచ్చాను. నీతి, నిజాయతి ఉన్న ఎవరికైనా ఆవేశం ఉంటుంది. అందుకే మేం కలిశాం' అన్నారు. అన్ని కులాల వారితో కలిసి పనిచేయటం వల్లే ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. వంగవీటి రంగా కుమారుడు రాధా మంచి ఆశయంతో టీడీపీలో కొనసాగుతున్నారని, కూటమి గెలుపుకు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. విడదల రజిని ఒక్కసారికే విపరీతమైన వ్యతిరేకత మూటగట్టుకున్నారన్నారు. మంత్రిగా విపరీతమైన అవినీతి చేసి.. ఆ డబ్బుతో గెలవాలని చూస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే జగన్ కాపులకు సీట్లిచ్చారని విమర్శించారు. జగన్‌వద్ద ఉండాలంటే ఆత్మాభిమానం చంపుకుని పనిచేయాలని, స్వాభిమానం వున్నవారు ఆయనవద్ద ఉండలేరని చెప్పారు. కులం కాకుండా గుణం చూసి ఓట్లు వేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో వడ్డాణం హరిబాబు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, కాపు నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో ప్రత్తిపాటి పుల్లారావు

ఐదేళ్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ నాశనం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మే 3: పొరపాటున ఎవరైనా వైసీపీకి ఓటు వేసి జగన్ మళ్ళీ ముఖ్యమంత్రి ఐతే రాష్ట్రంలో ప్రజా పంపిణీ పెను ప్రమాదంలో పడినట్లేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల నుంచి అధికార వైసీపీ నేతలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. 27వ వార్డులో షేక్ యాసిన్, సన్ని, ఇంతియాజ్ ఆధ్వర్యంలో 80మంది, 28వవార్డు నుంచి శీలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాపు కులానికి చెందిన నలుగురు ముఖ్య నాయకులతో పాటు వారి అనుచరులు, మల్లెల రాజేష్ నాయుడు, గుంజి వీరాంజనేయులు ఆధ్వర్యంలో 13, 17 డివిజన్‌ల నుంచి 20 ఎస్సీ కుటుంబాలు, 38వ వార్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన 20 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు, 29వ డివిజన్‌లో షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో నాలుగు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో వారందరికీ ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ పాలనలో పౌర సరఫరాల వ్యవస్థను సర్వనాశనం చేశారని ధ్వజ మెత్తారు. అనేక మార్గాల్లో గ్రామాల్లో, పట్టణాల్లో లక్షల తెల్లకార్డులు తొలగించారని, తద్వారా ప్రభుత్వ పథకాలకు ప్రజలను దూరం చేసేందుకు కుట్ర పన్నారని దుయ్యబట్టారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ కానుకలు ఎత్తివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారాలంటే కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావాలని, సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలను మంచి మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.



ఎమ్మెల్యే గోపిరెడ్డికి హారతి ఇస్తున్న అంగన్ వాడీ వర్కర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేను సత్కరిస్తున్న డ్వాక్రా సీసీ నక్షత్రం

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

నరసరావుపేట అర్బన్,మే3: మండలంలోని అన్నవరం గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీచేసినా పలువురు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అన్నవరం గ్రామానికి చెందిన డ్వాక్రా సీసీ నక్షత్రం, అంగన్ వాడీ వర్కర్ భాగ్యలక్ష్మిలు ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరు ఎమ్మెల్యేను సన్మానించగా మరొకరు ఆయనకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142, 151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

65,876 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 50,957 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 65,876 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,249 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	18500
నెంబరు. 5	9000	13000
273	10000	11000
341	8500	18000
4884	9000	14000
సూపర్ 10	16000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9000	17000
దేవనూరు డీలక్స్	9000	16000
తెల్లకాయలు	5000	11000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ప్రజాదీవెన యాత్రలో పథకాల కరపత్రాలు పంచుతున్న నసీర్

కూటమి ప్రభుత్వంతోనే 'గుంటూరు తూర్పు' అభివృద్ధి

● కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకుంటుందని కూటమి అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని ఏడో డివిజన్ గుంటూరువారి తోటలో ఇంటింటికి తిరుగుతూ ఆయన ప్రచారం నిర్వహించారు. కూటమి పార్టీల మేనిఫెస్టోను మూడు పార్టీల నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని గుంటూరువారి తోటలో ఎక్కువగా వ్యాపార సముదాయం, ఆసుపత్రులు ఉన్నాయని అందువల్ల ఆ ప్రాంతం ఎంతో రద్దీగా ఉంటుందని అన్నారు. ట్రాఫిక్ సమస్యతో అక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, సరైన సదుపాయం కల్పించకుండా ప్రభుత్వం ప్రజలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సమస్యకి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఖుదుస్, ఉస్మాన్, కొనకళ్ళ సత్యం, గౌస్, కొత్తూరు వెంకట్, కోటేశ్వరరావు, ఫరూక్, రజాక్, మన్నెం శ్రీను, పద్మావతి, బాజీ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో నూర్‌బాషాలకు స్థానం కల్పించడం హర్షణీయం

● టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ముస్లింలతో పాటుగా నూర్ బాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి 100 కోట్లు కేటాయిస్తామని చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షదాయకమని టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ లాల్ వజీర్ అన్నారు. అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో మైనార్టీలపై దాడులు, హత్యలు తప్ప వారి అభివృద్ధికి పాటుపడిన దాఖలాలు లేవన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వైసీపీ పాలనలో మోసపోయిన మైనార్టీలందరూ టీడీపీ కండువా కప్పుకుంటున్నారన్నారు. ఈనెల 6న టీడీపీ జిల్లా కార్యాలయంలో ముస్లిం, నూర్ బాషాల ఆత్మీయ సమావేశం జరుగుతుందని తెలిపారు. గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు, పశ్చిమ ఉమ్మడి అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో ఆదం షఫీ, కేఎంఈ హుస్సేన్, షేక్ నాగూర్, షేక్ షహీద్ బాబు, షేక్ మీరావలి, లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నేతలు

జగన్‌కు వృద్ధుల ఉసురు తగులుతుంది

● టీడీపీ నేత అత్తోట రామ నరసింహారావు

గుంటూరు సిటీ, మే 3 : రెండు నెలలుగా పెన్షన్లు సక్రమంగా పంపిణీ చేయకుండా వృద్ధులను ఇబ్బందులు పెడుతున్న జగన్‌కు వాళ్ళ ఉసురు కచ్చితంగా తగులుతుందని టీడీపీ నేత అత్తోట రామ నరసింహరావు అన్నారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన పెన్షన్ల పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగులను ఇళ్లకు పంపి పెన్షన్లు పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వైసీపీకి లబ్ధి చేకూర్చే విధంగా పని చేస్తున్నారని ఆరోపించారు. వృద్ధులు బ్యాంకులకు వెళ్లి పెన్షన్లు తీసుకోవటం తలకు మించిన భారమని అన్నారు. ఎండలు భయంకరంగా ఉన్నాయని, ఇటువంటి పరిస్థితుల్లో తన రాజకీయాలు కోసం జగన్ పైశాచికంగా ప్రవర్తిస్తున్నాడని అన్నారు. ప్రజలు, వృద్ధులు జగన్ శాడిస్ట్ అన్న విషయాన్ని గుర్తెరిగి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం, అభివృద్ధి

● ముస్లిం సేన నాయకుల ఇంటింటి ప్రచారం

గుంటూరు, మే 3 : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ జాయింట్ సెక్రటరీ, ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సుభాని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సంఘం నాయకులతో కలిసి గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అంకమ్మ నగర్‌లో టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి గెలుపు కోసం ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి ముస్లింలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు హయాంలో ముస్లింల సంక్షేమానికి పెద్ద పీట వేసి రంజాన్ తోఫా, సబ్సిడీ రుణాలు, దుల్హన్ పథకం, కడపలో హజ్ హౌస్ నిర్మాణం, ఉర్దూ భాషాభివృద్ధి, మసీదుల మరమ్మతుల నిర్మాణం కొరకు నిధులు, ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ, 40 కోట్లతో దూదేకుల ఫెడరేషన్ ఏర్పాటు చేయడం, షాదిఖానాల నిర్మాణం కొరకు 86.42 కోట్ల నిధులు మంజూరు చేయడం, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల కొరకు స్థలం, నిధులు కేటాయించడం, విదేశీ విద్య, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కొరకు జీవో ఎంఎస్ నంబరు 18ను ప్రవేశ పెట్టి అమలు చేయడం ఇలా మొదలగు పథకాల ద్వారా ముస్లింల సమగ్రాభివృద్ధికి ఎంతగానో కృషి చేయడం జరిగిందన్నారు.

మానవ హక్కులలో భాగంగానే పత్రికా స్వేచ్ఛను పరిగణించాలి

గుంటూరు, మే 3 : మానవ హక్కులలో భాగంగానే పత్రికా స్వేచ్ఛను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణించాలని ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఏపీ రామారావు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వాక్ స్వాతంత్ర్యానికి సంకెళ్ళు అనే అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పరిగణించే పత్రికలు, మీడియా నిష్పక్షపాతంగా పని చేసే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించారని, పౌరులు, పత్రికలు, మీడియా ప్రభుత్వాల పని తీరును ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే హక్కు ఇవ్వటం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని, ఏ పత్రికైనా, పౌరుడైనా మాట్లాడితే ముఖ్యంగా ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మురళీకృష్ణ, కోటేశ్వరరావు, సాంబశివ రావు, సింగరయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు : జాన్‌బాబు

గుంటూరు, మే 3: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని గుంటూరు పశ్చిమ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రాచకొండ జాన్‌బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆర్ అగ్రహారం, అడపాబ జార్, శ్రీనివాసరావుపేట ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నవ్యాంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదాపైనే రాహుల్ గాంధీ సంతకం చేస్తారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సందీప్, మహమూద్, కార్యకర్తలున్నారు.

కాపులను ముంచిన జగన్‌రెడ్డి

● పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి



ఎన్నికల ప్రచారంలో చిన్నారితో గల్లా మాధవి

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): కాపులను జగన్‌రెడ్డి నిలువునా ముంచేశాడని పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి గల్లా మాధవి ఆరోపించారు. గుంటూరు 20వ డివిజన్ సంపత్ నగర్‌లో శుక్రవారం మల్లెల రాజేష్ నాయుడు, ఉగ్గిరాల సీతారామయ్య, వనమా నరేంద్రతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ఆమెకు స్థానికులు ఘన స్వాగతం పలికి మద్దతు తెలిపారు. ప్రచారం సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ దివాళా తీస్తుందని జగన్ రెడ్డికి భయంపట్టుకుందని ఆమె ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌పై నిరాధార ఆరోపణలు చేయిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కాపు, బలిజ బాంధవుడు, జగన్ రెడ్డి కాపు ద్రోహి అని ఆమె దుయ్యబట్టారు.

ఎస్‌వీ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడిగా ఉన్నపుడే చంద్రబాబు బలిజ సామాజికవర్గానికి చెందిన అంతరాజీ మోహన్‌ను యూనివర్సిటీ ఛైర్మన్ చేశారని ఆమె గుర్తు చేశారు. కాపు కార్పొరేషన్ పెట్టి తగుస్థాయిలో నిధులు కేటాయించి వారి సంక్షేమం, అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, కాపునేత చినరాజప్పను మొదటిసారి ఉపముఖ్యమంత్రిని చేసింది చంద్రబాబు మాత్రమేనని ఆమె అన్నారు. కాపుల సంక్షేమానికి చంద్రన్న అన్నివిధాలా మంచే చేశారని, జగన్ కుటుంబం కాపులకు ద్రోహం చేసిందని ఆరోపించారు.

మాధవికే మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు : షరీఫ్

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవికే మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ మద్దతు ఉందని ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షరీఫ్ తెలిపారు. గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను, పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవిని గెలిపించాలని వంగవీటి రాధాకృష్ణ, తులసి రామచంద్ర ప్రభు కోరారు. శుక్రవారం జరిగిన కాపుల ఆత్మీయ సమావేశంలో వారిరువురు పాల్గొన్నారు.

'తూర్పు'లో 73 శాతం హోమ్ ఓటింగ్ పూర్తి

● కమిషనర్, ఆర్వో కీర్తి చేకూరి

గుంటూరు(కార్పొరేషన్), మే 3 : గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 73 శాతం హోం ఓటింగ్‌ని శుక్రవారం పూర్తి చేయడం జరిగిందని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. చౌత్రా సెంటర్‌లో జరుగుతున్న హోం ఓటింగ్‌ని తూర్పు నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఎలక్షన్ ఏజంట్ల సమక్షంలో కమిషనర్, ఆర్‌ఓ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా హోం ఓటింగ్ విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం హోం ఓటింగ్‌కి అమలు చేస్తున్న మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 97 మందిని అర్హులుగా గుర్తించడం జరిగిందన్నారు. హోం ఓటింగ్ నిర్వహణకు సీనియర్ గెజిటెడ్ అధికారులతో 5 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన హోం ఓటింగ్‌లో 97 మంది ఓటర్లకు గాను 71 మంది ఓట్లు పోల్ చేసి 73 శాతం పోలింగ్ జరిగిందన్నారు. శనివారం హోం ఓటింగ్‌లో మిగిలిన వారి ఓట్లు పోల్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియలో అధికారులతో పాటుగా తూర్పు నియోజక వర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ఎలక్షన్ ఏజంట్లు కూడా పాల్గొని ఎన్నికల సరళిని పరిశీలించారని తెలిపారు.



హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్న కమిషనర్ కీర్తి చేకూరి

ఈవీఎంల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు(కార్పొరేషన్), మే 3 : ఈవీఎంల కమిషనింగ్ విధులు నిర్వహించే అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. స్థానిక ఏసీ కాలేజీలో జరుగుతున్న తూర్పు నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్, ఆర్‌ఓ మాట్లాడుతూ, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తూర్పు నియోజకవర్గ (95) అసెంబ్లీ ఈవీఎంల కమిషనింగ్ ఏసీ కాలేజీలో జరుగుతుందని, కమిషనింగ్‌కు సెక్టార్ అధికారుల వారీ బాధ్యతలు కేటాయించామన్నారు. విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా కమిషనింగ్ నిర్వహించాలన్నారు. కమిషనింగ్‌లో ఏ సమస్య ఎదురైనా వెంటనే టెక్నికల్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. శనివారం పార్లమెంట్ ఈవీఎంల కమిషనింగ్ జరుగుతుందన్నారు.

కూటమితోనే ముస్లింల సంక్షేమం సాధ్యం

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ

బాపట్ల, మే 3 : కూటమితోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ అన్నారు. ఎన్డీయే కూటమి విజయం కోరుతూ చేపట్టిన రాష్ట్ర పర్యటనలో భాగంగా శుక్రవారం బాపట్ల విచ్చేసిన ఆయన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మరాదన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకుందని టీడీపీకి ఓటు వేయరాదనే ప్రచారాన్ని నమ్మరాదన్నారు. గతంలో తెలుగుదేశం బీజేపీతో పొత్తుపెట్టుకున్నప్పటికి ముస్లింలకు ఏవిధమైన నష్టం జరగలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలకు తీరని ద్రోహం చేశారన్నారు. నాలుగుశాతం రిజర్వేషన్ తీసేస్తారనే ప్రచారం సరికాదన్నారు. రిజర్వేషన్ కాపాడింది చంద్రబాబేనన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీరా సాహెబ్, బాపట్ల అధ్యక్షుడు షేక్ ఇలియాజ్, జిల్లా అధ్యక్షుడు షేక్ దిలీప్, షేక్ పీరాసాహెబ్, గుంటూరు నాయకులు ఎస్‌కే ముస్తఫా, స్థానిక నాయకులు పఠాన్ రాజేష్, తాజుద్దీన్, కరీముల్లా, నాయబ్ రసూల్, నిజాం తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రవర్మతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న షేక్ రఫీ

మాదిగలకు ద్రోహం చేసిన వైసీపీని గద్దెదించండి

● మాదిగల కుల సంఘం జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావుమాదిగ

తెనాలి రూరల్, మే 3: మాదిగలను అన్నివిధాలుగా వంచనచేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలో గద్దెదించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాదిగకుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు ప్రకటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాల పేరు మీద దారి మళ్లించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీలకు చెందిన 27 పథకాలను రద్దుచేసిన దళిత ద్రోహి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.

ఎస్సీలు కలలుగంటున్న వర్గీకరణ బిల్లు సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. దళితవర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టేరాజు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి దళితుల అభ్యున్నతిని కుంటుపరిచి, దళితులపై దాడులకు పాల్పడుతూ వారి శవాలను డోర్ డెలివరీ చేసిన హంతకులకు అండగా నిలిచి దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. ఐదేళ్లలో విద్యా ఉద్యోగ సంక్షేమ రాజకీయ రంగాలలో దళితుల అభివృద్ధిని 20ఏళ్ల వెనక్కి నెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెనాలి నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగజంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొలవరపు కోటేశ్వరరావు మాదిగ, డీపీఎఫ్ తెనాలి మండల అధ్యక్షుడు సుద్ధపల్లి శశికిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



సంఘ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న నాదెండ్ల మనోహర్

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మృతి

● మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

● ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ప్రమాదం


మల్కాపురం, మే 3: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్‌తో ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వైద్య విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన విశాఖనగరం సింధియా జంక్షన్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లాకు చెందిన షేక్ జానీబాషా, అతని ఇద్దరి స్నేహితులు కొమ్మాదిలోని గాయత్రి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. వీరు ముగ్గురూ ద్విచక్రవాహనంపై వేకువజామున మల్కాపురం నుంచి సింధియా మీదుగా నగరంలోకి వెళ్లేందుకు బయలుదేరారు. సింధియా జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో షేక్ జానీబాషా అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న వీరిని ఆస్పత్రికి తరలించారు. వీరి వివరాలు తెలియరాలేదు. వేకువజామున ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చి వెళుతున్నారో కూడా తెలియడం లేదని పోలీసులు చెబుతున్నారు. షేక్ జానీబాషా మృతి చెందిన విషయాన్ని పల్నాడులో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు ఎంబీబీఎస్ ఫస్టియర్ చదువుతున్నట్టు షేక్ జానీబాషా తండ్రి పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన పాఠ్య పుస్తకాలపై జేవీవీ ఆధ్వర్యంలో శిక్షణ

గుంటూరు(విద్య), మే 3 : పదవ తరగతి విద్యార్థులకు అందించే నూతన పాఠ్యపుస్తకాలపై ఈనెల 19న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు పోస్టర్స్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఇతర వివరాలకు 8309965083లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, ఫణికుమార్, చావా శ్రీనివాస్, జి.వెంకటరావు, ఎన్.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

సంక్షేమం పేరుతో ముస్లింలకు నమ్మక ద్రోహం

● మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఫార్కు షబ్లీ



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు ఫార్కు షబ్లీ

పొన్నూరు టౌన్, మే 3: వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమం పేరుతో నమ్మక ద్రోహం జరిగిందని మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఫార్కు షబ్లీ ఆరోపించారు. పట్టణంలోని ఇట్టికంపాడు రోడ్డులో శుక్రవారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఫార్కు షబ్లి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలపై వేధింపులు, దాడులు జరిగాయని ఆరోపించారు. అధికార పార్టీ వేధింపులు భరించలేక అబ్దుల్ సలామ్ అతని కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. కర్నూలులో యువతిపై అత్యాచారం, హత్య, చదువుల తల్లి మిస్బా ఆత్మహత్య చేటుచేసుకున్నాయన్నారు. ఇవేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలపై జరిగిన దాడులు, హత్యలు లెక్కలేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముస్లింల సంక్షేమం కోసం ప్రాధాన్యం ఇస్తే వైసీపీ ప్రభుత్వంలో కేవలం 4వేల కోట్ల ఖర్చు చేసారని అదికూడా నవరత్నాల కింద అందరికీ వచ్చే నిధులే ముస్లింలకు వచ్చాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దుల్హన్ పథకం కింద 48,693 మందికి లబ్ధి చేకూరితే వైసీపీ ప్రభుత్వంలో కేవలం 2000 మందికి మాత్రమే ఆంక్షలతో ఈ పథకాన్ని వర్తింప చేశారన్నారు. మసీదుల కోసం కేవలం 87.82 లక్షల నిధులు, రంజాన్ పండుగ కోసం రూ.1.60 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. విదేశీ విద్య పథకం కింద టీడీపీ హయాంలో 577మంది లబ్ధిపొందితే వైసీపీ పాలనలో 42మంది మాత్రమే లబ్ధిపొందారన్నారు. షేక్ కార్పొరేషన్, దూదేకుల కార్పొరేషన్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఒక్క నయాపైసా నిధులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రతి ముస్లిం విజ్ఞతతో ఆలోచించి తమ సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వాని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ మాయలో పడవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ, మండలానికి చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న బీసీ నేతలు

రాష్ట్రంలో బీసీలు బతకకూడదా?

● టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ

● బీసీలపై దాడులను నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా బీసీలు నరకం అనుభవిస్తున్నారు.. అసలు ఈ రాష్ట్రంలో బీసీలు బతకకూడదా? అంటూ టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ నిలదీశారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ టీడీపీ విశ్వబ్రాహ్మణ సాధికార విభాగం ఆధ్వర్యంలో అరండల్‌పేటలో బీసీ నాయకులు, విశ్వబ్రాహ్మణులు మండుటెండలో అర్ధనగ్నంగా మోకాళ్ళమీద నిలబడి జంధ్యం చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములకొండ మాట్లాడుతూ అరాచకాలు, ఆకృత్యాలు, హత్యా రాజకీయాలకు కేరఫ్ అడ్రస్ అయిన జగన్‌రెడ్డి అండతోనే రాష్ట్రంలో వైసీపీ రౌడీమూక రెచ్చిపోతోందన్నారు. ప్రశాంతమైన మచిలీపట్నంలో వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు ప్రచారం పేరుతో బీసీల ఇళ్లపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. కిట్టు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు, కార్యకర్తలు ఎవరూ రాకపోవడంతో గంజాయి బ్యాచ్‌ని వేసుకొని తిరుగుతూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు కర్రి మహేష్ ఇంటి ముందు బాణాసంచా కాల్చి కవ్వింపు చర్యలకు పాల్పడుతుంటే ప్రశ్నించినందుకు ఇంట్లోకి చొరబడి దౌర్జన్యం చేశారన్నారు. గట్టి శ్రీనివాస్, జంపని నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు వైసీపీ ప్రభుత్వానికి జంధ్యంతోనే ఉరివేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. జంధ్యాలు వేసుకునేవాడివి నీకెందుకురా రాజకీయం అని కులం పేరుతో దూషించిన పేర్ని కిట్టు విశ్వబ్రాహ్మణ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పదిర ఈశ్వరచారి, పేగుడోలు లక్ష్మాచారి, ఎలవర్తిపాటి పాపాచార్యులు, ముంజంపల్లి శివకుమార్, పామర్తి మోహనరావు, కడియాల సుబ్బారావు, నాగేశ్వరాచారి, వెంకటాచారి, దాడోజు గురుబ్రహ్మం, మేడూరి రమణమూర్తి, కందుకూరి గురుబ్రహ్మాచారి తదితర టీడీపీ బీసీ, విశ్వబ్రాహ్మణ సామాజికవర్గ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మే డే ప్రాధాన్యం రోజురోజుకు మరింత పెరుగుతోంది

● విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ

గుంటూరు తూర్పు, మే 3 : కార్మిక వర్గ రాజ్యాధికార దీక్షా దినం మే డే ప్రాధాన్యం మరింత పెరుగుతోందని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఏటి అగ్రహారం 10వ లైన్ కూడలిలో డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు విల్సన్ అధ్యక్షతన మే డే సభ జరిగింది. తొలుత మే డే జెండాను కృష్ణ ఎగుర వేశారు. అనంతరం జరిగిన సభలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వి.ముత్తయ్య ఉరికొయ్యలు చెరసాలలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పేదల స్థలాలను వైసీపీ నాయకులు కబ్జాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఏటి అగ్రహారం పదవ లైన్‌లో 70 సంవత్సరాలుగా పేద దళిత మహిళలు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటే ఆ స్థలాన్ని స్థానిక 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమణకు దిగి వారి రేకుల షెడ్డు దుకాణాలను కూలదోయించాడని ఆరోపించారు. పేద దళిత మహిళలను కులం పేరుతో దుర్భాషలాడి అవమానించాడని వివరించారు. దీన్ని వారించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి వి.ముత్తయ్యను కూడా కులం పేరుతో దూషించి దుర్భాషలాడాడన్నారు. దీనిపై పేద దళిత మహిళలు అచ్చాల వెంకటరెడ్డిపై కేసు పెట్టినా పోలీసులు ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీఎఫ్ రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, బహుజన పొలిటికల్ సెంటర్ సమన్వయకర్త సాదు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న విప్లవ రచయితల సంఘం నాయకులు

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ఎన్నికల నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ

గుంటూరు, మే 3 : రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ సూచించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్వీప్ వారి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు ఎంతో పవిత్రమైనదని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో చీఫ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుతో సరైన పాలకులను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్, డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం, ఏటీఎం సత్యనారాయణ, పలువురు సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి సత్యనారాయణ తదితరులు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ముగిసిన ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(విద్య), మే 3 : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు 13 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు మొత్తం 37 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ కె.అపర్ణసీతారామ్, యూనిస్‌ఖాన్ పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి తదితరులు


పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

సమస్యాత్మకం.. సవాలే

- నాలుగో వంతుకు పైగా సమస్యాత్మక కేంద్రాలు
- యంత్రాంగానికి సవాల్‌గా మారిన ఎన్నికలు
- ముందస్తు చర్యలతోనే సాఫీగా ప్రక్రియ

> జిల్లాలో ఈసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేనా అన్న అనుమానాలు ఓటర్లలో వ్యక్తమవుతోంది. అటు రాష్ట్రంలో అరాచక పాలన, ఇటు జిల్లాలో అధికార పార్టీ వ్యవహరించిన తీరు.. తాజాగా జిల్లాలో జరిగిన అరాచక ఘటనలతో ప్రజానీకం మరింత ఆందోళన చెందుతోంది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల్లో నాలుగోవంతుకు పైగా సమస్యాత్మక మైనవిగా ఎన్నికల యంత్రాంగం గుర్తించింది. ఈ నేపథ్యంలో 13న జనగనున్న పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడం జిల్లా యంత్రాంగానికి కత్తిమీద సాములాగే కనిపిస్తోంది. అటు పోలీసులు ఇటు అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు దీంతో యంత్రాంగానికి ఎన్నికల నిర్వహణ సవాల్‌గా మారనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ఏ మేరకు సాఫీగా సాగుతాయన్న అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నికల ముందు ఆ తర్వాత పోలింగ్ రోజున వివిధ ఘటనలు చోటుచేసుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల నామినేషన్‌లు కూడా వెయ్యనీయలేదు. అభ్యర్థులపై దాడులు, నామినేషన్ పత్రాల చించివేత వంటి ఘటనలు పోలీసుల కళ్లముంతే జరిగినా వారు ప్రేక్షకపాత్ర వహించారు. ఈ ఘటనలను గుర్తు తెచ్చుకుంటున్న ఓటర్లు ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

29 శాతం కేంద్రాలు సమస్యాత్మకం

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 17,34,858 మంది ఓటర్లు ఉన్నారు. 1026 లొకేషన్‌లలో 1,926 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 557 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అత్యధికంగా గురజాల నియోజకవర్గంలో 304 పోలింగ్ కేంద్రాలు ఉంటే 57 శాతానికి పైగా అంటే 174 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవి. దాదాపు ఇదే పరిస్థితి మాచర్ల నియోజకవర్గంలో కూడా ఉంది. మాచర్ల సెగ్మెంట్‌లో 299 పోలింగ్ కేంద్రాలకు గాను 50శాతంకు పైగా 151 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. గతంలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఘర్షణలు జరగడం, ఒకే పార్టీ అభ్యర్థికి 75 శాతానికి పైగా ఓట్లు వచ్చినవి, ఒక వర్గం వారిని పోలింగ్‌కు రాకుండా అడ్డుకున్న పరిస్థితులు, ప్రత్యేకించి దళిత ఓటర్లకు ఆటంకం కలిగించే ఘటనలు చోటు చేసుకుంటే ఆ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. అలాగే మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ఎన్నికల కోడ్ అమల్లో వచ్చిన తర్వాత కూడా అనేక అరాచక ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలోనే ఎక్కువగా సమస్యాత్మక కేంద్రాలు ఉండటం ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. పటిష్ఠ బందోబస్తు ఇతర చర్యలతో స్వేచ్ఛగా ప్రశాతంగా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ఇందులో పోలీసు పాత్ర అత్యంత కీలకం అయితే ప్రస్తుత పరిస్థితులు యంత్రాంగం, అధికార పార్టీ తీరుపై టీడీపీ అభ్యర్థుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నిర్వహణ యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. సాధారణ బందోబస్తు కాకుండా అదనపు బలగాల నియామకం, మందస్తుగా నిఘా పెంపు, వివాదాలు పెంచే వ్యక్తుల గుర్తింపు, వీరి కదలికల నియంత్రణ, పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్ల నియామయం, వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్ వంటి చర్యలు తీసుకోవాలి. వీటికి విస్తృత ప్రచారం కల్పించి ఓటర్లకు భరోసా కలిగించాల్సిన అవసరం ఉంది. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామన్న భరోసా కల్పిస్తున్నారు. పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. పోలీసు శాఖ తీసుకుంటున్న మందస్తు చర్యలు ఎటువంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.


పెదకూరపాడు మండలం గారపాడు గ్రామస్తులతో ఎస్పీ బిందు మాధవ్

నియోజకవర్గం	మొత్తం పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు
పెదకూరపాడు	266	44
చిలకలూరిపేట	239	32
నరసరావుపేట	245	70
సత్తెనపల్లి	274	27
వినుకొండ	299	59
గురజాల	304	174
మాచర్ల	299	151
మొత్తం	1926	557

ఆ నాలుగు నియోజకవర్గాలు సమస్యాత్మకం

- గుర్తించిన ఎన్నికల కమిషన్

నరసరావుపేట, మే 3: జిల్లాలో అరాచకాలు, దౌర్జన్యాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించింది. ఆ నాలుగు నియోజకవర్గాలను సమస్యాత్మకంగా ప్రకటించింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన అనంతరం జరిగిన దాడులు, అరాచకాల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆ నియోజకవర్గాలపై చర్యలు తీసుకుంది. మాచర్ల, గురజాల, వినుకొండ, పెదకూరపాడు నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశించింది. పెదకూరపాడులో 266 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వినుకొండలో 299, గురజాలలో 304, మాచర్లలో 299 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో మొత్తం 1,168 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని ఆదేశించింది. సీఆర్‌పీఎఫ్‌తో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలను టీడీపీ కూటమి నేతలు స్వాగతించగా వైసీపీ నేతలకు మింగుడు పడనిదిగా ఉంది.

1309 పోలింగ్ బూత్‌ల్లో వెబ్ కాస్టింగ్

- 373 సమస్యాత్మక కేంద్రాలకు మైక్రోఅబ్జర్వర్లు

గుంటూరు సిటీ, మే 3: జిల్లాలోని 1309 పోలింగ్ బూత్‌ల్లో వెబ్‌కాస్టింగ్ ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు కేటాయింపులపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 1915 పోలింగ్ బూత్‌ల్లో 372 క్రిటికల్ పోలింగ్ బూత్‌లకు మైక్రోఅబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్, వీవీప్యాట్ యూనిట్లను నియోజకవర్గాలకు కేటాయించామన్నారు. రెండో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఈవీఎం యూనిట్ల వివరాలను అభ్యర్థులకు ఇస్తామన్నారు. ఇంకా ఏమైన పోలింగ్ కేంద్రానికి ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని అభ్యర్థులు భావిస్తే వాటి వివరాలను పరిశీలకులకు అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2,347 మంది హోం ఓటింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించే అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు ఖర్చుల వివరాలను వ్యయపరిశీలకులకు అందించాలన్నారు. ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన ఓట్లను ట్రెజరీలోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు కార్తీకా, నీరజ్ కుమార్, సత్యరత్ అనురుద్ పంకజ్, మ్రిణల్‌కుమార్ దాస్, రాధానాథ్ పురోహిత్, ఎర్నే వినోద్‌కుమార్ చంద్రాభాన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, ఏఆర్వో బీమారావు, నోడల్ అధికారి శివరామకృష్ణ, అభ్యర్థులు, వారి ఏజెంట్లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు సర్వం సిద్ధం

అత్యంత కీలకమైన పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియకు సర్వం సిద్ధమైంది. పోస్టల్ బ్యాలెట్ పేపర్లు ఇతర జిల్లాలకు, జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపిణీకి సిద్ధం చేస్తున్న ప్రక్రియను ఎన్నికల జిల్లా అధికారి వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు శ్యామ్‌సుందర్, రఘు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిశీలన

అభ్యర్థులు మొదటి విడత సమర్పించిన ఖర్చులను గుంటూరు లోక్‌సభ వ్యయ పరిశీలకులు మృణాల్‌కుమార్ దాస్, ఎన్నికల జిల్లా అధికారి వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యయ పరిశీలన కమిటీ నోడల్ అధికారి శివరామకృష్ణ, గుంటూరు పార్లమెంట్ సహాయ వ్యయ పరిశీలకులు నల్లపాటి శ్రీనివాసరావు, శివాంజనేయులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు ఇలా..

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఎన్నికల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎక్కువ సంఖ్యలో ఇన్‌వ్యాలిడ్ అవుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం నిబంధనలు సరిగా పాటించకపోవడమే. గత ఎన్నికల్లో ఏకంగా 9,500 వరకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇన్‌వ్యాలిడ్ అయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు. ఉద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేస్తూ వస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట తడబడి తమ ఓటుని సరిగా వేయలేకపోతున్నారు. గతంలో పోస్టల్ బ్యాలెట్‌లను రాజకీయ పార్టీలు కొనుగోలు చేసేవి. ఆ విధానానికి ఎన్నికల సంఘం స్వస్తి చెప్పి ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి అక్కడే ఓటు వేసేలా నిబంధన తీసుకొచ్చింది. ఈ నెల 5, 6, 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరగనుంది. పోస్టల్ బ్యాలెట్‌లో 13ఏ(ఫారం-ఏ) డిక్లరేషన్, 13బీ(ఫారం-బీ) చిన్న ఎన్‌వెలప్ కవర్, 13సీ(ఫారంసీ) పెద్ద ఎన్‌వెలప్ కవర్, బ్యాలెట్ పేపర్-13డీలను చూసి అయోమయానికి గురికాకుండా ఓటు వేయడం ఎంతో సులభతరమని ఎన్నికల నిపుణులు సూచిస్తున్నారు.

- 13ఏ(ఫారం-ఏ) ఇది కాగితం రూపంలో ఉంటుంది. దీని మీద ఓటరు వివరాలు ఉంటాయి. ఈ పేపర్ పైనే గజిటెడ్ అధికారి సంతకం చేయించాలి. గజిటెడ్ అధికారులు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే అందుబాటులో ఉంటారు.
- 13బీ(ఫారం-బీ) ఇది చిన్న ఎన్‌వెలప్ కవర్. దీని మీద బ్యాలెట్ పేపర్ సీరియల్ రాసి ఉంటుంది. ఒకవేళ సీరియల్ లేకపోతే ఆ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. బ్యాలెట్ పేపర్ మీద ఎవరికైతే ఓటు వేయదలిచారో ఆ అభ్యర్థి పేరుకు ఎదురుగా ఉండే గడిలో రైట్ టిక్ మార్కు చేయాలి. బ్యాలెట్ పేపర్‌ని ఆ చిన్న కవర్‌లో పెట్టి సీలు వేయాలి.
- 13సీ(ఫారం-సీ) ఇది పెద్ద ఎన్‌వెలప్ కవర్. దీని మీద ఓటరు సంతకం చేయాలి. అసెంబ్లీ/పార్లమెంట్ ఏది అయితే అది రాయాలి.
- డిక్లరేషన్ ఫారం, బ్యాలెట్ పేపర్ పెట్టి సీలు చేసిన ఫారం-బీ రెండిటిని పెద్దకవర్ ఫారం-సీలో పెట్టి సీలు చేసి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఉండే బాక్సులో వేయాలి. ఏమైనా అనుమానాలుంటే అక్కడ అందుబాటులో ఉండే పీవో/ఏపీవోలని సంప్రదించొచ్చు.

తొలిరోజు హోం ఓటింగ్ 44.03 శాతం

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలి రోజున హోం ఓటింగ్(ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగం) ప్రశాంతంగా ముగిసింది. బూత్ స్థాయి ఏజంట్ల సమక్షంలో హోం ఓటింగ్ బృందాలు ఎవరైతే ఇంటి వద్దనే ఓటు వేస్తామని ఫారంలు ఇచ్చారో వారి ఇళ్లకు వెళ్లి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటింగ్ చేయించారు. బీఎల్‌వోల ద్వారా ముందుగానే తాము ఫలానా సమయానికి వస్తామని ఓటర్లకు సమాచారం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 2,348 మంది ఇంటి వద్దనే ఓటు వేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. వారిలో తొలి రోజైన శుక్రవారం 1,034 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. దీంతో 44.03 శాతం పోలింగ్ నమోదైంది. మిగిలిన వారి ఇళ్లకు కూడా శని, ఆదివారాల్లో వెళ్లి 100 శాతం హోం ఓటింగ్‌ని పూర్తి చేస్తామని రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

నియోజకవర్గాల వారీగా హోం ఓటింగ్ ఇలా...

నియోజకవర్గం పేరు	హోం ఓటర్ల సంఖ్య	ఓటు వేసినవారి సంఖ్య
తాడికొండ	449	122
మంగళగిరి	452	151
పొన్నూరు	284	114
తెనాలి	352	166
ప్రత్తిపాడు	367	200
గుంటూరు పశ్చిమ	347	210
గుంటూరు తూర్పు	97	71
మొత్తం	2348	1034

కరకట్టపై కనికరించలేదు

- కనీస మరమ్మతుల దాఖలాలూ లేవు
- పటిష్ఠతపై ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- కోతలతో ప్రమాదకరంగా మారినా పాలకుల నిర్లక్ష్యం

రేపల్లె, మే 3: కృష్ణమ్మ జనావాసాల్లోకి రాకుండా కట్టడి చేసే కరకట్టపై వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా కనికరించలేదు. గోతులు, కోతలతో ప్రమాదకరంగా మారినా పట్టించుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లలో కరకట్టపై కనీసంగా కూడా దృష్టి సారించని దాఖలాలు లేవు. కరకట్ట ఎక్కడికక్కడ కోతలతో, ఇసుక వాహనాల రాకపోకలతో భారీ గుంతలు పడి బీటలు వాలి ప్రమాద భరితంగా మారింది. ఏ యేడుకా ఏడాది కరకట్టలు అభివృద్ధి చేస్తామంటూ వరదల సమయంలో అధికారులు హడావుడికే పరిమితమవుతున్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కరకట్టకు కనీస మరమ్మత్తులు నిర్వహించిన దాఖలాలు లేవు. కృష్ణానది వెంబడి పదుల సంఖ్యలో ఇసుక రీచ్‌లు ఉండటంతో 20 చక్రాల టిప్పర్లు, భారీ లారీలు, ట్రాక్టర్లు ఇసుక లోడ్‌తో కరకట్ట వెంబడి రాకపోకలు సాగిస్తుండటంతో కరకట్ట అధ్వానంగా తయారైంది. ఆర్‌సీ అధికారులు ఇసుక లారీల వద్ద మామూళ్లు వసూలు చేస్తున్నారే తప్ప కరకట్ట మరమ్మతుల గురించి ఆలోచించిన దాఖలాలు లేవు.

ఆవేదనను ఆలకించడంలేదు

ఇరువైపులా ముళ్లచెట్లతో, భారీగా గోతులతో ప్రమాదకరంగా ఉన్న కరకట్టను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కట్ట వెంబడి ఉన్న గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో ప్రమాదభరితంగా మారిందంటున్నారు. కరకట్ట వెంబడి పెట్రోలింగ్ నిర్వహించాల్సిన ఆర్‌సీ అధికారులు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవంటున్నారు. గతంలో ఓలేరు పల్లెపాలెం సమీపంలో కట్టకు గండి పడి వేలాది ఎకరాల పంట దెబ్బతినడంతో పాటు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. అయినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదని రైతులు మండిపడుతున్నారు. భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 40 కీమీ మేర కరకట్ట వెంబడి 30 గ్రామాలున్నాయి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు సమీపంలో కరకట్ట మోకాలు లోతు గోతులతో ప్రమాదభరితంగా మారింది. పెదపులివర్రు, ఓలేరు మధ్యలో భారీగా బీటలువాలింది. రేపల్లె మండలం రావి అనంతవరం, పెనుమూడి వద్ద భారీవాహనాల కారణంగా రోడ్డు ఛిద్రమై పోయింది. రుద్రవరం, మైనేనివారిపాలెం, మోర్తోట, ప్రాంతాల్లో కోతలకు గురై మట్టికొట్టుకుపోయింది. కనగాలవారిపాలెం సమీపంలో మైనేనివారిపాలెం, పిరాట్లంక సమీపంలో కరకట్టకు పైప్‌లు వేసి ఇంజన్ల ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా మారింది. గంగడిపాలెం, రాజుకాల్వ, లక్ష్మీపురం, లంకేవానిదిబ్బ, సమీపంలో కరకట్ట కోతలకు గురైంది. లక్ష్మీపురం నుంచి లంకేవానిదిబ్బ వరకు కృష్ణానది ఆనుకుని రొయ్యల సాగుతో కరకట్ట బాటగా మారింది. వరదల సమయంలో ఇసుక బస్తాలు వేసి ఆ రెండు మూడు రోజులు హడావుడి చేస్తున్నారే కాని కరకట్టను బలపరిచిన దాఖలాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ గాడులు పడి కోతలకు గురై ప్రమాదభరితంగా మారింది. వర్షాకాలంలో కోతలకు గురౌవుతున్న కరకట్టను వేసవిలో బాగు చేస్తామని పాలకులు, అధికారులు ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో సాధ్యమైన దాఖలాలులేవు.


చెన్నుపల్లివారిపాలెం సమీపంలో కోసుకుపోయిన కరకట్ట


రుద్రవరం సమీపంలో కరకట్ట పూడుకుపోయి గోతులమయం ఇరుపక్కల ముళ్ళచెట్లతో కాలిబాటగా తయారైన కరకట్ట


పెనుమూడి వారథి సమీపంలో కోతలకు గురైన కరకట్ట


కనగాలవారిపాలెం సమీపంలో కరకట్టకు అమర్చిన పైపులైన్లు, మోటార్లు


పెదపులివర్రు సమీపంలో బీటలు వారిన కరకట్ట


మైనేనివారిపాలెం సమీపంలో కోతకు గురైన కరకట్ట


కొల్లూరు వద్ద ప్రమాదకరంగా రాకపోకలు

అన్నిచోట్లా కూటమి అభ్యర్థుల్ని గెలిపించండి

- టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధా

గుంటూరు, మే 3(ఆంధ్రజ్యోతి): ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని చూడొద్దు.. ఎక్కడైనా కూటమి అభ్యర్థినే గెలిపించండి అంటూ టీడీపీ స్టార్ క్యాంపెయినర్ వంగవీటి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గుంటూరు రూరల్ మండలంలో పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చేయి చేయి కలుపు.. చేజారదు గెలుపు' అన్న వంగవీటి మోహనరంగా నినాదాన్ని గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్కరు 13వ తేదీన కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. బటన్లు నొక్కి నొక్కి అలసిపోయిన జగన్ను రెండుసార్లు బటన్ నొక్కి ఇంటికి పంపించాలన్నారు. పెమ్మసాని రామాంజనేయులును మన ప్రతినిధులుగా గెలిపించి నిలబెట్టుకుందామన్నారు. జగన్, ఆయన పార్టీ నాయకులు కలిసి ఆంధ్రప్రదేశ్‌ను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరాచక పాలనకు విసుగెత్తిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. కూటమిగా ఏర్పడ్డ మూడు పార్టీల నాయకుల ఆగమనాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని, ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేగా బూర్ల రామాంజనేయులుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

అమెరికా నుంచి వస్తున్నా...

- అమరావతికి మద్దతుగా ఓటు వేస్తా...


కాటా హర్షిత

మేడికొండూరు, మే 3: గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం మేడికొండూరుకు చెందిన కాటా హర్షిత 9 నెలల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లారు. అయితే ఈ నెల 13 వ తేదీన ఏపీలో జరుగుతున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆమె అమెరికాలోని డల్లాస్ నుంచి బయలు దేరి మేడికొండూరుకు వస్తున్నట్టు ఆమె తల్లి దండ్రులకు సమాచారం ఇచ్చారు. వ్యయ, ప్రయాసలకు లోనై ఎందుకు వస్తున్నావని ఆమె తల్లిదండ్రులు ప్రశ్నించారు. తాను అమరావతి రాజధాని రైతుల ఆందోళనను చూశానని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచి అమరావతి రైతులు తాడికొండ నియోజక వర్గంలోని గ్రామాలలో ఇంటింటికి వెళ్లి రాజధానిని నిర్మించేవారికి ఓటు వేసి గెలిపించాలని వేడుకుంటున్న తీరు తనను కలచి వేసిందని చెప్పుకొచ్చారు. తన వంతు బాధ్యతగా రాజధాని ప్రాంత నియోజకవర్గమైన తాడికొండ పరిధిలో ఉన్న తన ఓటు హక్కును తొలిసారిగా వినియోగించుకొనేందుకు అమెరికా నుంచి బయలుదేరి వస్తున్నట్టు హర్షిత తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

లోకేశ్‌ను, పెమ్మసానిని గెలిపించాలని ప్రచారం



గుండిమెడలో ప్రచారం నిర్వహిస్తున్న కొమ్మారెడ్డి కిరణ్ తదితరులు

తాడేపల్లి, మే 3: నారా లోకేశ్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ తాడేపల్లి మండలం, గుండిమెడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, మండల ఉపాధ్యక్షుడు గుండిమెడ రమేష్ బాబు, గుండిమెడ పార్టీ అధ్యక్షుడు చిగురుపాటి సుబ్బారావు, జనసేన పార్టీ గుండిమెడ గ్రామ అధ్యక్షుడు జెట్టి రమేష్, టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి నామతోటి రాంబాబు, మహిళా అధ్యక్షురాలు నామతోటి ఝాన్సీ, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షురాలు నాగేంద్రం, అనుమోలు వీరాంజనేయ ప్రసాద్, అనుమోలు సాంబశివరావు, దున్నా కరుణాకర్, గంజి రమేష్, గుండిమెడ బాలకిషోర్ రాజు, తురకా నాగరాజు, కావూరి బాలయ్య, జెట్టి కోటేశ్వరరావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో..

నారా లోకేశ్‌ను, పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరుతూ తాడేపల్లి మండలం, కుంచనపల్లిలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుంచనపల్లి గ్రామ టీడీపీ, జనసేన పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి బలపరిచిన మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థి లోకేశ్‌ను గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, బొర్రా కృష్ణవందన, బిరుదుగడ్డ రమేష్, దాసెట్టి అరుణ, జనసేన నాయకుడు మేకల రాజా, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాజలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ప్రచారం



కాజలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

మంగళగిరి, మే 3: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున మంగళగిరి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారా లోకేశ్, గుంటూరు పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌లను గెలిపించాలని కోరుతూ ఆయా పార్టీల నేతలు శుక్రవారం మంగళగిరి మండలం కాజ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఎస్టీకాలనీ, హరిజనవాడ, పుల్లయ్యనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఉమ్మడి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కలిగే మేలును ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, కూటమి నేతలు నంబూరు రవి, కుక్కమళ్ల దానియేలు, కుక్కమళ్ల సాంబశివరావు, చింకా కోటేశ్వరరావు, పోతురాజు శ్రీనివాసరావు, కంకణాల శంకరరావు, బూనం రాఘవరావు, మేడా శ్రీనివాసరావు, కారుమూరి శ్రీనివాస రెడ్డి, భాస్కరరెడ్డి, చిలకలపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సతీమణి జయమ్మ



మహిళలకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బూర్ల జయమ్మ

పెదనందిపాడు, మే 3 : మహిళా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులు సతీమణి జయమ్మ అన్నారు. మండలపరిధిలోని ఉప్పలపాడులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. టీడీపీ మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జంపని హనుమంతరావు, జిల్లా మహిళా కార్యదర్శి పిడికిటి లక్ష్మీగణేశ్, అనపర్తి సీతమ్మ, ఎంపీటీసీ బొగ్గవరపు లక్ష్మీప్రసన్న, మాజీ ఎంపీటీసీ కొప్పుల కోటేశ్వరరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు బొగ్గవరపు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఈదర బ్రహ్మానందం, దాసరి శ్రీకాంత్, నాయకులు మల్లిక, యశోద, రాధిక, రమాదేవి, రాసజ్ఞ, చిన్న, బొల్లా శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యుడు శనగళ్ల నరసింహారావు మృతి

ప్రత్తిపాడు, మే 3: పేదల వైద్యుడిగా పేరొందిన శనగళ్ల నరసింహారావు (80) శుక్రవారం ప్రత్తిపాడులోని తన స్వగృహంలో మరణించాడు. ప్రత్తిపాడులో వైద్యం సరిగా అందుబాటులో లేని రోజుల్లో ఆర్ఎంపీ వైద్యుడిగా ఆయన ఈ ప్రాంతానికి సేవలు అందించారు. డబ్బులు ఆశించకుండా పది సంవత్సరాల క్రితం వరకు ఆయన తన వృత్తిని ప్రత్తిపాడులో కొనసాగిస్తూనే ఉన్నాడు. ప్రత్తిపాడు మండలపరిధిలో అన్ని గ్రామాల్లో ఆయనకు వైద్యుడిగా మంచి పేరుంది. ఈ క్రమంలోనే గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రత్తిపాడు మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నియమావళిని ఉల్లంఘించిన వైసీపీపై కేసు నమోదు

ప్రత్తిపాడు, మే 3: ప్రత్తిపాడులో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వైసీపీ నేతపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి ప్రత్తిపాడులో జరిగిన వైసీపీలో ర్యాలీలో నియమావళికి విరుద్ధంగా టపాసులు, డీజేలను ఏర్పాటు చేయడంపై టీం 5 ఇన్‌చార్జి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైసీపీకి చెందిన మెట్టు వెంకటప్పారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

హోం ఓటింగ్ ద్వారా మొదటి ఓటు నమోదు

● వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటింగ్ సౌకర్యం

● మంగళగిరిలో 452 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు

● 15 పోలింగ్ బృందాల నియామకం: ఆర్వో రాజకుమారి



ఎన్నికల సిబ్బంది సహకారంతో హోం ఓటింగ్‌లో వృద్ధురాలు

మంగళగిరి సిటీ, మే 3: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళగిరిలో మొదటి ఓటు పడింది. హోం ఓటింగ్ ద్వారా పలువురు వృద్ధులు, దివ్యాంగులు శుక్రవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85 సంవత్సరాల వయస్సు దాటిన వారికి, 40 శాతం అంగవైకల్యం చెందిన వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. మంగళగిరి నియోజకవర్గంలో 85 సంవత్సరాలు పైబడిన వృద్ధ ఓటర్లు 212 మంది, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లు 240 మందిని కలుపుకుని మొత్తం 452 మంది హోం ఓటింగ్‌ను ఎంపిక చేసుకున్నట్టు జాయింట్ కలెక్టరు, మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి తెలిపారు. వీరి కోసం ప్రత్యేకంగా 15 పోలింగ్ బృందాలను నియమించినట్టు చెప్పారు. ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, సూక్ష్మ పరిశీలకులు, పోలీస్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారని తెలిపారు. ఈ బృందాలు ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు రూట్ ప్లాను ప్రకారం ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారని, ఎవరైనా ఇంటి వద్ద లేనట్టయితే 7, 8 తేదీల్లో మరోమారు ఓటర్ల ఇంటికి వెళతారని చెప్పారు. హోం ఓటింగ్ బృందాలకు ఇప్పటికే తగిన శిక్షణ ఇచ్చామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, బూత్ లెవల్ ఏజెంట్లు ఈ విషయాన్ని గమనించి హోం ఓటింగ్‌కు హాజరు కావొచ్చని తెలియజేశారు.

తాడేపల్లిలో 28 మంది..



పోలకంపాడులో హోమ్ ఓటింగ్ నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బంది

తాడేపల్లి టౌన్, మే 3: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో శుక్రవారం 28 మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 89 బూత్‌లలో 98 మంది హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు ఎన్నికల అధికారి బి.శివారెడ్డి తెలిపారు.

తాడికొండలో 120 హోం ఓట్లు

తాడికొండ, మే 3: నియోజకవర్గంలో హోం ఓట్లు 120 పోలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం గంగరాజు శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో 449 ఓట్లు హోం ఓట్లు ఉన్నట్లు తెలిపారు. హోం ఓటింగ్‌కు 10 రూట్లలో టీమ్‌లను పంపినట్లు తెలిపారు. ఓటు వినియోగించుకునే వారికి బీఎల్‌వోలచే సమాచారం ఇచ్చామన్నారు. 449 ఓట్లలో 120 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని చెప్పారు.

28 మంది ఓటు హక్కు వినియోగం

పెదనందిపాడు, మే 3 : పోలింగ్ సిబ్బంది రెండు టీమ్‌లు రెండు రోజులపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల వద్దే ఓటు వేసేందుకు శుక్రవారం ఏర్పాట్లు చేశారు. నేరుగా ఓటరు ఇంటి వద్దకు వెళ్ళి ఎన్నికల సిబ్బంది ఓటింగ్ నమోదు చేశారు. 25 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారి తెలిపారు.

హోమ్ ఓటింగ్ ఉపయోగించుకున్న 198 మంది

ప్రత్తిపాడు, మే 3: నియోజకవర్గంలో 198 మంది హోం ఓటింగ్‌ను ఉపయోగించుకున్నట్లు ప్రత్తిపాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకర్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 4591 మంది ఉండగా అందులో 367 మందికి మాత్రమే హోం ఓటింగ్ సౌకర్యం కల్పించారు. ప్రత్తిపాడు 48, వట్టిచెరుకూరు 94, పెదనందిపాడు 63, కాకుమాను 66, గుంటూరు తూర్పు 21, పశ్చిమ 75 మందికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించారు.

జగన్మోహన్‌రెడ్డి అబద్ధాల కోరు.. ప్రజలారా నమ్మకండి

● నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య



ప్రచారంలో పాల్గొన్న బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య తదితరులు

మేడికొండూరు: ఏప్రిల్ 3: కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అవన్నీ తానే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి అబద్ధాల కోరని, ఆయన మాటలు ప్రజలెవరూ నమ్మవద్దని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య సూచించారు. ఎన్డీఏ కూటమి తరపున పోటీ చేస్తున్న గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మేడికొండూరులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సగానికి పైగా కేంద్ర ప్రభుత్వం నిధులేనని చెప్పారు. రైతుభరోసాకు కేంద్ర ప్రభుత్వం ఆరు వేలు ఇస్తుండగా దానితో 7వేల 5వందలు కలిపి 13వేల 5వందలు రైతులకు ఇస్తూ మొత్తం తానే ఇస్తున్నట్టు జగన్మోహన్‌రెడ్డి అబద్ధాలు చెబుతూ ఎవరికో పుట్టిన బిడ్డ, నా బిడ్డ అని చెప్పుకొని జగన్‌మోసం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న జలజీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వని కారణంగా ఆనిధులు విడుదల గాక నేడు రాష్ట్రంలో తాగునీటి సమస్య తీవ్రమైందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని జగన్మోహన్ రెడ్డి అబద్ధపు ప్రచారం చేయిస్తున్నాడని విమర్శించారు. పేదల కోసం కేంద్ర ప్రభుత్వం 25 లక్షల గృహాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరు చేస్తే వాటిని జగనన్న కాలనీలుగా మార్చి ప్రచారం చేసుకుంటున్నా రని ఆరోపించారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా.2.70 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా బియ్యం కేంద్రం ఇస్తుంటే రేషన్ షాపుల వద్ద జగన్ బొమ్మలు వేలాడుతున్నాయని, ఆయుష్మాన్ భారత్ క్రింద ప్రజారోగ్యం కోసం కేంద్రం నిధులు ఇస్తుంటే దానిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీగా మార్చుకొని జగన్మోహన్‌రెడ్డి స్టిక్కర్ వేసుకుంటున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రం అధోగతి పాలు కాకుండా సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బ్రహ్మయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆమతి వెంకటరమణ, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ బాషా, తుపాకుల మహమ్మద్ ఉమర్, మేడికొండూరు మండల మైనార్టీ మోర్చ అధ్యక్షుడు గాజుల కృష్ణమూర్తి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కోట సాంబశివరావు, ఆరుద్ర గోపిరాజు బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో తెలుగుమహిళల ప్రచారం



దుగ్గిరాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న తెలుగుమహిళలు

దుగ్గిరాల, మే 3: ఎన్నికల సమీపిస్తుండటంతో టీడీపీ శ్రేణులు మరింత ఉత్సాహంతో ప్రచారం నిర్వహిస్తున్నారు. దుగ్గిరాలలో ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనతో ప్రచారం ముమ్మరం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అంగీకారంతో ప్రకటించిన మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ శుక్రవారం తెలుగుమహిళలు ప్రచారాన్ని కొనసాగించారు. దేశంలోనే విజన్ కలిగిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు చేసిన అభివృద్ధిని గుర్తుచేసుకోవాలని ప్రజలకు సూచించారు. గూడూరు ఉషారాణి, గద్దె శివకుమారి, పొన్నం విద్యశ్రీ, జంపాల కావ్య, అత్తోట భారతి, పాటిబండ్ల విజయలక్ష్మి, బాణావత్ ఉమాదేవి, గార్లపాటి లక్ష్మి, ఎర్రమాసు సాయిశ్రీ, షేక్ జుబేదా, ఎండేటి రక్షిత, తుమ్మపూడి కోటేశ్వరి, ఆదిపూడి వెంకటేశ్వరమ్మ, షేక్ నసీమున్, జంపాల నాగమణి, సాయిరత్న, జీ. కోమలి, బంగారు లక్ష్మి, కొల్లి రజని తదితరులు పాల్గొన్నారు.

407 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 3: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 407 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,500 గరిష్ఠ ధర రూ.14,670 మోడల్‌ధర రూ.14,440 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,800 గరిష్ఠధర రూ.14,670, మోడల్‌ధర రూ.14,440 పలికాయి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి టౌన్, మే 3: పోలకంపాడు సెంటర్‌లో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం శనివారం ఉదయం 8.30 నుంచి 10.00 గంటల వరకు నులకపేట, ఉండవల్లి, పోలకంపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

తటస్థులపై దృష్టి పెట్టాలి : సునీల్‌చౌదరి

కాకుమాను, మే 3: గ్రామాల్లో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీకి దూరంగా ఉండే తటస్థులపై దృష్టి పెట్టాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నువ్వుల సునీల్‌చౌదరి శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ స్థాయి నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఓటూ కీలకమేనన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ యువత అధికార పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. అటువంటి వారికి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సూపర్‌సిక్స్ పథ కాలు, సామాజిక పెన్షన్‌లు పెంపు తదితర అంశాలపై చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా, పోలీసు సిబ్బంది

పెదనందిపాడు, మే 3 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీఎస్పీ షేక్ మహబూబ్‌బాషా అన్నారు. మండలపరిధిలోని కొప్పర్రు, అన్నవరం, ఉప్పలపాడు గ్రామాల్లో సాయుధ దళాలతో కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని, ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలని, నాయకులు సిబ్బందికి సహకరించాలని, ఎలాంటి అల్లర్లకు పాల్పడరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ డి.రాజ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : షేక్ అబ్దుల్ ఘని



పొన్నెకల్లులో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు అబ్దుల్ ఘని తదితరులు

తాడికొండ, మే 3: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అవుతుందని గుంటూరు పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఘనీ తెలిపారు. శుక్రవారం పొన్నెకల్లు గ్రామంలోని మైనార్టీ ఏరియా లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఘని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే 18 నుంచి 59 సంవత్సరాలలోపు మహిళలకు నెలకు రూ.1500 అడబిడ్డ నిధిని అం దిస్తామన్నారు. ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, సంవత్సరానికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రతి పేద కుటుంబంలో ఆడపిల్ల పెళ్లికి లక్ష రూపాయలు చంద్రన్న పెళ్లికానుక, గ్రామంలో షాదీఖాన మరమతులకు నిధులు మంజూరు చేస్తారని అన్నారు. ఎన్‌డీఏ కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌లను గెలిపించా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షేక్ రిజ్వాన, గుంటూరు మైనార్టీ కార్యదర్శి రఫీ, మొయుద్దిన్, జానీ బాషా, బర్కత్ అలీ, నిడుముక్కల బాషా తదితరులు పాల్గొన్నారు.

ముట్లూరు ఆలయంలో వార్షిక శాంతి కల్యాణం

వట్టిచెరుకూరు, మే 3: మండలపరిధి ముట్లూరు గ్రామంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి మహిళలు దేవా లయానికి తరలివచ్చి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రికి స్వామివార్ల వార్షిక శాంతి కల్యాణం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

శిడిమాను తరలింపు

వట్టిచెరుకూరు గ్రామ ప్రజల గ్రామ దేవత అద్దంకమ్మ అమ్మవారి తిరు నాళ్ళ మహోత్సవంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని పోలేరమ్మ వారి దేవాలయం నుంచి శిడిమాను మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో ఊరేగింపుగా అద్దంకమ్మ అమ్మవారి దేవాలయానికి చేర్చారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేడు బ్రాహ్మణి పర్యటన

మంగళగిరి, మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా బ్రాహ్మణి శనివారం మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తాడేపల్లి పట్టణం నులకపేటలోని ట్విస్ట్ షర్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో మహిళా కార్మికులతో సమావేశమవుతారు. సాయంత్రం 5:15 గంటలకు మంగళగిరి పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాలులో స్త్రీశక్తి లబ్ధిదారులు, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో భేటీ అవుతారు. 6:30 గంటలకు వైష్ణవి ఫంక్షన్ హాలు నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, మెయిన్ బజారు మీదుగా రోడ్‌షోలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎన్నికలకు ముందే వైసీపీ ఖాళీ

● టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ, పలువురు నాయకులు



శ్రావణ్‌కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ దంపతులు, నాయకులు

తాడికొండ, మే 3: సార్వత్రిక ఎన్నికలకు ముందే వైసీపీ ఖాళీ అవుతుందని ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గుంటూరులోని నియోజకవర్గ కార్యాలయంలో తెనాలి శ్రావణ్‌కుమార్ సమక్షంలో వైసీపీ జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి దంపతులు, దామరపల్లి గ్రామ వైసీపీ అధ్యక్షులు చలమాల వీరబాబు మరికొంత మంది వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ తాడికొండ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోని వీధుల్లో టీడీపీ హయంలోనే సీసీ రోడ్లు వేశారన్నారు. నియోజకవర్గంలో నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా వైసీపీ చేసిందన్నారు. రాజధాని అమరావతిని సర్వనాశనం చేశారన్నారు. రాష్ట్రంలో టీడీపీ గెలుపు చారిత్రక అవసరం అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జీ సాంబశివరావు, పీ వెంకటేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు తాటి తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరులో 40 ఎస్టీ కుటుంబాల చేరిక

తుళ్ళూరు, మే 3: తుళ్లూరులో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో 40 ఎస్టీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. వారికి శ్రావణ్‌కుమార్ పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎర్రంగుంట్లపాడులో టీడీపీ ఇంటింటి ప్రచారం



ఎర్రగుంట్లపాడులో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రావణ్‌కుమార్

ఫిరంగిపురం, మే 3 : మండలంలోని ఎర్రగుంట్లపాడు గ్రామంలో శుక్రవారం నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు జనసేన, టీజేపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. గ్రామంలో మేళతాళాలతో పూలు చల్లుతూ మహిళలు హారతులు ఇచ్చి ఆహ్వానించారు. ఇంటింటికి తిరిగి ఓటర్లను అభ్యర్థించిన శ్రావణ్‌కుమార్ గ్రామంలోని కూడలిలో ప్రసంగించారు. రాబోయే కూటమి ప్రభుత్వంలో కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారన్నారు. ఓట్లు చీలకుండా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కూటమి ద్వారానే సాధ్యమన్నారు. రాజధాని నిర్మాణం జరగాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాజధాని ద్వారానే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కనుకనే విజ్ఞతతో ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మండవ నరసింహారావు, జిల్లా కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, సర్పంచ్ కేశవ్, మాజీ సర్పంచులు నరసింహారావు, నాలి అప్పారావులు, ఫరూక్ అహమ్మద్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుయువత, జనసేన ఆధ్వర్యంలో బైకు ర్యాలీ



తుళ్లూరులో జనసేన తెలుగు యువత కార్యకర్తల బైకు ర్యాలీ

తుళ్ళూరు, మే 3: నియోజకవర్గ కూటమి అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ తుళ్లూరులో శుక్రవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి ముందు తెలుగుయువత మాజీ అధ్యక్షుడు తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్(చందు) ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. జనసేన, తెలుగుయువత కార్యకర్తలు రెండువందల బైకులతో ర్యాలీ నిర్వహించి ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్ తెనాలి శ్రావణ్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రచారం నిర్వహించారు.

దళిత వ్యతిరేకి జగన్‌ను ఓడించడమే లక్ష్యం

● మాదిగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు

మంగళగిరి సిటీ, మే 3: రాజ్యాంగం కల్పించిన దళిత హక్కులను కాలరాసిన దళిత వ్యతిరేకి జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా దళితులంతా ఐక్యంగా పని చేయాలని మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని అమరావతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తానని అధికారంలోకి వచ్చిన జగన్ గడిచిన అయిదేళ్లలో ఎస్సీ వర్గీకరణ ఊసే ఎత్తలేదని ధ్వజమెత్తారు. మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్లు పెట్టి ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించకుండా దారుణంగా మోసం చేశారన్నారు. దళితులపై దాడి చేసిన వారికి జగన్ ప్రభుత్వం అండగా నిలిచిందని, దళితులపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి తీవ్రంగా హింసించిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్లించి ఎస్సీల సంక్షేమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని, 27 దళిత పథకాలను రద్దు చేసి దళితుల పొట్టకొట్టారని మండిపడ్డారు. ఇప్పటికే ఉపాధి లేక అల్లాడుతున్న దళితులు జగన్ మళ్లీ గెలిస్తే పక్క రాష్ట్రాలకు వలస వెళ్లవలసిన పరిస్థితులు దాపురిస్తాయని హెచ్చరించారు. మాదిగలకు సామాజిక న్యాయం చేసింది ఒక్క తెలుగుదేశం పార్టీయేనన్నారు. దళిత వర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరును పెట్టుకున్నారని, దళిత నియోజకవర్గమైన అమరావతి రాజధానిలో మూడు రాజధానుల ఉద్యమం పేరుతో దళితులతో ఉద్యమం చేయించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. అమరావతి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మంగళగిరిలో నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనరు కట్టెపోగు ఉదయ భాస్కర్, నవ్య మాదిగ చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు, బేడ, బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ఎస్సీ కమిషన్ మాజీ అధ్యక్షుడు కట్టెపోగు బసవయ్య, సుజనరావు, ప్రభుదాసు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాదిగ సంఘాల జేఏసీ ప్రతినిధులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


సంఘనాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేస్తున్న మనోహర్

మాదిగలకు ద్రోహం చేసిన వైసీపీని గద్దెదించండి

● మాదిగల కుల సంఘం జేఏసీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావుమాదిగ

తెనాలి రూరల్, మే 3: మాదిగలను అన్నివిధాలుగా వంచనచేసిన వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికలో గద్దెదించి కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాదిగకుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు ప్రకటించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నవరత్నాల పేరు మీద దారి మళ్లించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఎస్సీలకు చెందిన 27 పథకాలను రద్దు చేసిన దళిత ద్రోహి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఎస్సీలు కలలుగంటున్న వర్గీకరణ బిల్లు సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. దళితవర్గాల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టేరాజు మాట్లాడుతూ దళిత ఓట్లతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి దళితుల అభ్యున్నతిని కుంటుపరిచి, దళితులపై దాడులకు పాల్పడుతూ వారి శవాలను డోర్ డెలివరీ చేసిన హంతకులకు అండగా నిలిచి దుర్మార్గంగా వ్యవహరించారని విమర్శించారు. ఐదేళ్లలో విద్యా ఉద్యోగ సంక్షేమ రాజకీయ రంగాలలో దళితుల అభివృద్ధిని 20ఏళ్లు వెనక్కి నెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెనాలి నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ గాజుగ్లాసు గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నాయకులు కోరారు. చర్మకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజెండ్ల సుబ్బారావు, బేడ బుడగజంగం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొవెవరపు కోటేశ్వరరావు మాదిగ, డీపీఎఫ్ తెనాలి మండల అధ్యక్షుడు సుద్దపల్లి శశికిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 3: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం అన్నదాత సుఖీభవ సభ్యులు కుర్రా శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు జితిన్‌కృష్ణ పుట్టినరోజు సందర్భంగా, మున్నంగి శేషసాయిఅంబరీష్, గాయత్రి శ్రావ్యప్రద దంపతుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుర్రా శ్రీనివాసరావు, అబ్దుల్‌రజాక్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


పింఛన్ల కోసం బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

పింఛన్ల కోసం బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

తెనాలి రూరల్, మే 3: ప్రభుత్వం అందించే నెలవారీ పింఛన్ కోసం వృద్ధులు బ్యాంకుల వద్ద పడిగాపులుపడక తప్పటం లేదు. 1వ తారీకే పింఛన్ వస్తుందని ఆశపడ్డ లబ్ధిదారులకు సచివాలయాల సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని తెలపడంతో మండుటెండలో వృద్ధులు బ్యాంకుల వద్దకు వస్తున్నారు. గత నెలలో ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పింఛన్ పంపిణీ చేయడంతో తమకు ఇబ్బంది కలగలేదని ఈ నెలలో కూడా అదే విధానాన్ని అమలుచేస్తే తమకు ఎంతో మేలుకలిగేదని బ్యాంకుల వరకూ రావాలంటే ఎండ, ఉక్కపోతకు తమ ప్రాణాలు ఫణంగా పెట్టే పరిస్థితి నెలకొందని పలువురు వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటువంటి అనాలోచిత నిర్ణయాలతో వృద్ధుల ప్రాణాలతో చలగాటం ఆడవద్దని విజ్ఞప్తి చేశారు.

మానవ హక్కులలో భాగంగానే పత్రికా స్వేచ్ఛను పరిగణించాలి

● ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఏవీ రామా రావు

గుంటూరు, మే 3 : మానవ హక్కులలో భాగంగానే పత్రికా స్వేచ్ఛను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణించాలని ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఏవీ రామా రావు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వాక్ స్వాతంత్ర్యానికి సంకెళ్ళు అనే అంశంపై శుక్రవారం జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పరిగణించే పత్రికలు, మీడియా నిష్పక్షపాతంగా పని చేసే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. రాజ్యాంగంలో భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించారని, పౌరులు, పత్రికలు, మీడియా ప్రభుత్వాల పని తీరును ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నించే హక్కు ఇవ్వటం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని, ఏ పత్రికైనా, పౌరుడైనా మాట్లాడితే ముఖ్యంగా ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మురళీకృష్ణ, కోటేశ్వరరావు, సాంబశివ రావు, సింగరయ్య ఉన్నారు.

నేడు బ్రాహ్మణి పర్యటన వివరాలు

మంగళగిరి, మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా నారా బ్రాహ్మణి శనివా రం మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు. సాయంత్రం 4:30 గంటలకు తాడేపల్లి పట్టణం నులకపేటలోని ట్విల్స్ షర్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో మహిళా కార్మికులతో సమావేశమవుతారు. సాయంత్రం 5:15 గంటలకు మంగళగిరి పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాలులో స్త్రీశక్తి లబ్ధిదారులు, మహిళా మిత్ర, డ్వాక్రా మహిళలతో భేటీ అవుతారు. 6:30 గంటలకు వైష్ణవి ఫంక్షన్ హాలు నుంచి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, మెయిన్ బజారు మీదుగా రోడ్‌షోలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

407 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 3: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 407 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.12,500 గరిష్ఠ ధర రూ.14,670 మోడల్‌ధర రూ.14,440 పలికాయి. కాయ క్వింటా ల్‌కు కనిష్ఠ ధర రూ.12,800 గరిష్ఠధర రూ.14,670, మోడల్‌ధర రూ.14,440 పలికాయి.

ముగిసిన ప్రాంగణ ఎంపికలు

గుంటూరు (విద్య), మే 3: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు 13 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు మొత్తం 37 మంది హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కోఆర్డినేటర్ కె.అపర్ణసీతారామ్, యూనిస్‌ఖాన్ పాల్గొన్నారు.

కష్టపడి పైకి వచ్చాం... కష్టం విలువ తెలుసు

● ప్రజల సమస్యలు పరిష్కరించటానికే వచ్చాం
● కూటమి అభ్యర్థులను గెలిపించండి
● గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖర్


వల్లభాపురం రోడ్ షోలో పాల్గొన్న కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, మే 3: కష్టపడి పైకి వచ్చాం ... కష్టం విలువ తెలుసు... ప్రజల కష్టాలను తీర్చటానికి వచ్చాం రానున్న ఎన్నికల్లో మమ్ములను గెలిపించాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి మండల పరిధిలోని చివలూరు, వల్లభాపురం గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించడంతో మహిళలు హారతులు పడుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రాజధాని ఇక్కడే ఉంటుందని చెప్పి ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబు ఎంత కష్టపడ్డారో ప్రతి ఒక్కరికి తెలుసు అన్నారు. కియా సంస్థ ద్వారా


తూములూరులో ప్రచారం నిర్వహిస్తున్న మనోహరం

కొన్ని వందల ఉద్యోగాలు ఇవ్వగలిగారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకపోవటంతో ఎన్నో సంస్థలు ఇబ్బందులు పాలైనట్లు తెలిపారు. తెనాలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యుడిగా పనిచేసినప్పుడు కొల్లిపర మండలాన్ని అభివృద్ధి బాటలో నడిపించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపానన్నారు. అట్టడుగుస్థాయిలో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీరోడ్లు వేసి రూపరేఖలు మార్చినట్లు తెలిపారు. వైసీపీ అరాచపాలన నుంచి విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రోడ్ షోలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వంగా సాంబిరెడ్డి, భీమవరపు చినకోటిరెడ్డి, యర్రు వెంకయ్యానాయుడు, ఆళ్ళ వీరారెడ్డి, అవుతు నారాయణరెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, దాసరి నరసయ్య, భీమవరపు కిశోర్‌రెడ్డి, విప్పల రమేష్‌రెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం: మనోహరం

కొల్లిపర, మే 3: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థుల గెలుపుతోనే సాధ్యపడుతుందని నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు, హనుమాన్‌పాలెం, పిడపర్తిపాలెం గ్రామాల్లో ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ల గెలుపు కోసం ఆ పార్టీ శ్రేణులతో కలిసి మనోహరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మనోహర్‌కు గాజుగ్లాసు గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు యర్రు వెంకయ్యానాయుడు, భీమవరపు కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, బొల్లు యోగానందచటర్జీ, మొవ్వా వెంకయ్య, దివ్వెల ఏడుకొండలు, పాలడుగు జోగేంద్ర, కొండా కిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అభివాదం చేస్తూ ఓటు అభ్యర్థిస్తున్న మనోహర్

సంక్షేమ పాలన ఎన్డీఏ కూటమితోనే సాధ్యం: మనోహర్

తెనాలి రూరల్, మే 3: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజలకు నిజమైన సంక్షేమ పాలన ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనచైతన్యపాదయాత్రలో భాగంగా శుక్రవారం మనోహర్ ఉమ్మడి పార్టీల శ్రేణులతో కలిసి మండలంలోని కోపల్లె, అంగలకుదురు, చావావారి పాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, అంగలకుదురు టీడీపీ గ్రామప్రెసిడెంట్ కనగాల శ్రీనివాస్, నలుకుర్తి అశోక్‌బాబు, మున్నంగి సుబ్బయ్య, పలువురు ఉమ్మడి పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి: మిథుల్

తెనాలి రూరల్, మే 3: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ జనసేన పీఏసీ చైర్మన్, ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ కుమారుడు మిథుల్ ఇంటింట ప్రచారం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని చినరావూరుతోట, మండలంలోని కొలకలూరులో కూటమి నేతలతో కలిసి ప్రచారం నిర్వహించారు.


కొల్లిపరలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

టీడీపీ నాయకుల ప్రచారం

కొల్లిపర, మే 3: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉమ్మడి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు కిశోర్‌రెడ్డి, కంచర్ల అమృతరాజు, భీమవరపు లంకకోటిరెడ్డి, భీమవరపు వేణుగోపాల్‌రెడ్డి, ఎన్టీఆర్ కోటిరెడ్డి, భీమవరపు కమల, బొంతు చంద్రిక, భీమవరపు సునీత, గుదిబండి శివబసవమ్మ, ఎస్ఆర్ఐ వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, ఆరిమండ వెంకటరెడ్డి, వల్లభాపురం బసవయ్య , టీడీపీ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్
● పెదకాకాని, తక్కెళ్ళపాడులో వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక


ధూళిపాళ్ల నరేంద్ర, తాడిశెట్టి మురళిల సమక్షంలో టీడీపీలో చేరిన పెదకాకాని, తక్కెళ్ళపాడు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పెదకాకాని, మే 3: తెలుగుదేశం పార్టీ హయాంలోనే బీసీలకు సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని మండలం తక్కెళ్లపాడు, పెదకాకాని గ్రామ వైసీపీకి చెందిన 12 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పెదకాకాని గ్రామం వైసీపీ నియోజకవర్గం నాయకులు ముద్రబోయిన బాబు, తక్కెళ్ళపాడు గ్రామం నుంచి పేరం నాగరాజు, పేరం నాగేశ్వరరావు, దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గెలుపునకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో గుంటూరు మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, పెదకాకాని, తక్కెళ్ళపాడు గ్రామం తెలుగుదేశం - జనసేన - బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబూరులో...

పెదకాకాని, మే 3: పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన పెదకాకాని మండలం వైసీపీ అధ్యక్షుడు నంబూరు వీరరాఘవులు, నంబూరు గ్రామం ఎంపీటీసీ-5 వల్లభపురపు విజయ్ కుమార్ (బుజ్జి) పమిడిపాములు రాజు, బుల్లా ఆనంద్ పలు కుటుంబాలు నంబూరు గ్రామం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సమక్షంలో చింతలపూడిలోని టీడీపీలో చేరారు.

మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు....

మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు టీడీపీలో చేరుతున్నట్లు నంబూరు నాయకులు తెలిపారు. శుక్రవారం పెదకాకాని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే మాదిగల అభ్యున్నతి అన్నారు. వైసీపీలో ఎస్సీలకు సముచిత స్థానం, గౌరవం లేదని అందుకే తాము టీడీపీలో చేరుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ గెలుపునకు శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు.


నరేంద్ర సమక్షంలో టీడీపీలో చేరిన నంబూరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు


నంబూరులో ఓటర్లకు టీడీపీ మేనిఫెస్టోపై ప్రచారం చేస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె నాగ వైదీప్తి

ధూళిపాళ్ల నాగ వైదీప్తి ప్రచారం

పెదకాకాని, మే 3: ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లందరూ సైకిల్ గుర్తుపై ఓటువేసి పొన్నూరు నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖరును గెలిపించుకోవాలని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుమార్తె ధూళిపాళ్ల నాగ వైదీప్తి పిలుపునిచ్చారు. శుక్రవారం పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో నాగ వైదీప్తి ఇంటింటికి తిరిగి ఓటర్లను కలుసుకొని తెలుగుదేశం, జనసేన, బీజేపీ విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవైదీప్తి మాట్లాడుతూ అక్కడ రాష్ట్రం, ఇక్కడ గ్రామం అభివృద్ధి చెందాలంటే ఒక తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో నంబూరు మహిళ నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలపై దాడులను నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నాలుగేళ్లుగా బీసీలు నర కం అనుభవిస్తున్నారు.. అసలు ఈ రాష్ట్రంలో బీసీలు బతకకూడదా? అంటూ టీడీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ నిలదీశారు. రాష్ట్రం లో బీసీలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ టీడీపీ విశ్వబ్రాహ్మణ సాధికార విభాగం ఆధ్వర్యంలో అరండల్‌పేటలో బీసీ నాయకులు, విశ్వబ్రాహ్మణులు మండుటెండలో అర్ధనగ్నంగా మోకాళ్ళమీద నిలబడి జంధ్యం చూపిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేములకొండ మాట్లాడుతూ అరాచకాలు, అకృత్యాలు, హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అయిన జగన్‌రెడ్డి అండతోనే రాష్ట్రం లో వైసీపీ రౌడీమూక రెచ్చిపోతోందన్నారు. ప్రశాంతమైన మచిలీపట్నంలో వైసీ పీ అభ్యర్థి పేర్ని కిట్టు ప్రచారం పేరుతో బీసీల ఇళ్లపై దాడి చేయించడం దుర్మా ర్గమన్నారు. కిట్టు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు, కార్యకర్తలు ఎవరూ రాకపోవడంతో గంజాయి బ్యాచ్‌ని వేసుకొని తిరుగుతూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. జనసేన నాయకుడు కర్రి మహేష్ ఇంటి ముందు బాణసంచా కాల్చి కవ్వింపు చర్యలకు పాల్పడుతుంటే ప్రశ్నించినందుకు ఇంట్లోకి చొరబడి దౌర్జన్యం చేశారన్నారు. గట్టి శ్రీనివాస్, జంపని నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు వైసీపీ ప్రభుత్వానికి జంధ్యంతోనే ఉరివేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. జంధ్యాలు వేసుకునేవాడివి నీకెందుకురా రాజకీయం అని కులం పేరుతో దూషించిన పేర్ని కిట్టు విశ్వబ్రాహ్మణ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పదిర ఈశ్వరచారి, పేగుడీలు లక్ష్మాచారి, ఎలవర్తిపాటి పాపాచార్యులు, ముంజంపల్లి శివకుమార్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల సామగ్రితో హోం ఓటింగ్‌కు బయల్దేరిన సిబ్బంది

తొలి రోజు హోం ఓటింగ్ లో 114 ఓట్లు పోలింగ్

పొన్నూరు టౌన్, మే 3: పొన్నూరు నియోజకవర్గంలో శుక్రవారం హోం ఓటింగ్ ప్రారంభమైంది. తొలిరోజు 114 గృహాలకు వెళ్లిన ఎన్నికల సిబ్బంది 114ఓట్లు వృద్ధులు, వికలాంగులతో పోలింగ్ చేయించారు. నియోజకవర్గంలో 284మంది ఓటర్లు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా తొలిరోజు 165ఓట్లు పోలింగ్ చేయించాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకోగా కేవలం 114ఓట్లు మాత్రమే పోలయ్యాయి. హోంఓటింగ్ విధానంలో ఆరు దరఖాస్తులు పూరించాల్సిరావటం ఈ ప్రక్రియ కొత్తగా ఉండటంతో ప్రారంభంలో గందరగోళం నెలకొంది. శనివారం 2వ రోజు మిగిలిన ఓట్లు మొత్తం పోలింగ్ చేయించేందుకు ఎన్నికల సిబ్బంది ఏర్పాట్లు చేసుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఫారుక్ షుబ్లి, సభకు హాజరైన ముస్లింలు

సంక్షేమం పేరుతో ముస్లింలకు నమ్మక ద్రోహం

● మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఫారుక్ షుబ్లీ

పొన్నూరు టౌన్, మే 3: వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమం పేరుతో నమ్మక ద్రోహం జరిగిందని మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఫారుక్ షుబ్లీ ఆరోపించారు. పట్టణంలోని ఇట్టికంపాడు రోడ్డులో శుక్రవారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఫారుక్ షుబ్లి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో మైనార్టీలపై వేధింపులు, దాడులు జరిగాయని ఆరోపించారు. అధికార పార్టీ వేధింపులు భరించలేక అబ్దుల్ సలామ్ అతని కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. కర్నూలో యువతిపై అత్యాచారం, హత్య చదువుల తల్లి మిస్బా ఆత్మహత్య చేటుచేసుకున్నాయన్నారు. ఇవేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలపై జరిగిన దాడులు, హత్యలు లెక్కలేవన్నారు. గత ప్రభుత్వ హయాంలో ముస్లిం సంక్షేమం కోసం ప్రాధాన్యం ఇస్తే వైసీపీ ప్రభుత్వంలో కేవలం 4వేల కోట్లు ఖర్చు చేసారని అదికూడా నవరత్నాల కింద అందరికీ వచ్చే నిధులే ముస్లింలకు వచ్చాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దుల్హన్ పథకం కింద 48,693 మందికి లబ్ధి చేకూరితే వైసీపీ ప్రభుత్వంలో కేవలం 2000 మందికి మాత్రమే ఆంక్షలతో ఈ పథకాన్ని వర్తింప చేశారన్నారు. మసీదుల కోసం కేవలం 87.82 లక్షల నిధులు, రంజాన్ పండుగ కోసం రూ.1.60 కోట్లు ఖర్చు చేశారని వివరించారు. విదేశీ విద్య పథకం కింద టీడీపీ హయాంలో 577మంది లబ్ధిపొందితే వైసీపీ పాలనలో 42మంది మాత్రమే లబ్ధిపొందారన్నారు. షేక్ కార్పొరేషన్, దూదేకుల కార్పొరేషన్, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఒక్క నయాపైసా నిధులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ప్రతి ముస్లిం విజ్ఞతతో ఆలోచించి తమ సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వాని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ మాయలో పడవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ, మండలానికి చెందిన ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నరేంద్రకుమార్ తదితరులు

వైసీపీ ప్రభుత్వంలో 27 దళిత పథకాలు రద్దు

● ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే 3: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేశారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం చింతలపూడిలో మాదిగ యువసేన రూపొందించిన కరపత్రాలను నరేంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ దళితులకు జరిగిన అన్యాయంపై మేలుకోవాలని పిలుపునిచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో అంబేద్కర్ విదేశీ విద్యా, బెస్ట్ అవైలబుల్ స్కూల్, ఉన్నత విద్య, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కొత్త మెడికల్ కళాశాలలో రిజర్వేషన్, స్టడీ సర్కిల్స్, ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాలు, భూమి కొనుగోలు పథకం, సబ్‌ప్లాన్ నిధుల దారి మళ్లింపు, కులాంతర వివాహాల ప్రోత్సాహం వంటి 27 పథకాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. జగ్జీవన్ ఉచిత విద్యుత్ పథకం ద్వారా 46.47 లక్షల మందికి లబ్ధి జరిగితే వైసీపీ ప్రభుత్వంలో ఆంక్షలు విధించటంతో 20లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందలేదన్నారు. కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు అందించే విషయంలో 4467 జంటలకు రూ.82.38కోట్లు లబ్ధి జరిగిందని వివరించారు. భూమి కొనుగోలు పథకం కింద టీడీపీ హయాంలో 5386 ఎకరాలు కొనుగోలుచేసి పంపిణీ చేసినట్లు వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 4లక్షల మంది దళిత యువతకు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు సబ్సిడీ రుణాలు అందించినట్లు చెప్పారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకం ద్వారా 2500మంది దళిత విద్యార్థులు విదేశీ విద్య లబ్ధిపొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకాలు అన్ని పూర్తిగా నిలిచిపోయినట్లు చెప్పారు. ఇప్పటికైనా దళితులు మేలుకొని మేలు జరిగే కూటమికి మద్దను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, బీజేపీ ఇన్‌చార్జి సుధాకర్, మాదిగ యువసేన నాయకుడు చిలకా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులను ఆదుకోవాలి

● ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు

పొన్నూరు టౌన్, మే 3: మృతిచెందిన భవన నిర్మాణరంగ కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. భవన నిర్మాణరంగ కార్మికుడు పెరికల ప్రసాద్ శుక్రవారం మృతిచెందారు. ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమనిధిని పునరుద్ధరించి ప్రభుత్వం కార్మిక కుటుంబాలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ అత్యంత ప్రమాదకరం

● రైతు సంఘం నాయకుడు కొసరాజు వెంకట్రాయుడు

పొన్నూరు టౌన్, మే 3: వైసీపీ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం అత్యంత ప్రమాదకరమని రైతు సంఘం నాయకుడు కొసరాజు వెంకట్రాయుడు శుక్రవారం ఆరోపించారు. ఈ చట్టం హడావుడిగా అమలులోకి తెచ్చారన్నారు. ఈ చట్టం ప్రకారం ఆస్తి పత్రాలు నకళ్లు మాత్రమే యజమానుల దగ్గర ఉంటాయన్నారు. ఈ ఆస్తులకు సంబంధించిన న్యాయ వివాదాలు తలెత్తినప్పుడు సివిల్ కోర్టులు జోక్యం చేసుకోకూడదని చట్టంలో పొందుపర్చటం దారుణం అన్నారు. దీనివల్ల భూ యజమానులకు సమస్యలు తలెత్తితే న్యాయం జరిగే అవకాశం లేదన్నారు. ఎన్నికల ముందు అమలులోకి తెచ్చిన ఈ చట్టం ప్రమాదతీవ్రతను గుర్తించి ప్రతి ఒక్కరూ తీవ్రంగా వ్యతిరేకించాలని కొసరాజు వెంకట్రాయుడు డిమాండ్ చేశారు.